ANN తెలుగు

Follow: @ANNTELUGU

08-02-2025

# మహా పత్రిక


శనివారం, హైదరాబాద్ | సంపుటి- 22 | సంచిక- 68 | పేజీలు-08 | వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

**టాప్ న్యూస్**

## ఓవరాక్షన్ చేయవద్దు

- అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజగోపాల్ నగర్‌లో పర్యటించిన రంగనాథ్
- బాధితుల సమస్యలు వింటుండగా జోక్యం చేసుకున్న హైకోర్టు న్యాయవాది ముఖీం
- మీరు ఓవరాక్షన్ చేయవద్దని హైడ్రా కమిషనర్ హెచ్చరిక



03

## ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు పరిశ్రమలు

- రాష్ట్రంలో డ్రోన్ టెక్నాలజీ విస్తరణ
- మంత్రి శ్రీధర్‌బాబు




03

## ముస్లింలను బీసీల్లో ఎలా చేరుస్తారు?

- కులగణన జరిపిన విధానమే సరిగా లేదు
- కాంగ్రెస్ పై కిషన్ రెడ్డి ఫైర్



02



## తెలంగాణ జన సైనికుల్లో జోష్

### గాజు గ్లాసు గుర్తుకు ఓకే..

రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం

లోక్ బాడీ ఎన్నికల నేపథ్యంలో కీలక పరిణామం

వివరాలు 2లో



### ప్రయాగ్‌రాజ్ లో మాజీమంత్రి శ్రీనివాస గౌడ్

ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళాలో మాజీ మంత్రివర్యులు వి శ్రీనివాస్ గౌడ్ త్రివేణి సంగమంలో శుక్రవారం పుణ్య స్నానాలు చేశారు.



### ఓయూలో టెన్షన్.. టెన్షన్

- సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని ఆందోళన
- అర్ధ రాత్రి దాటిన విరమించని విద్యార్థులు

వివరాలు 2లో




### దళితుల తలరాత మార్చిన రేవంత్

- ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మకం
- గ్రూపులోని అన్ని కులాలకు రిజర్వేషన్లు
- ఎస్సీ వర్గీకరణ ద్వారా ఎవరికి అన్యాయం జరగదు
- ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్

వివరాలు 3లో




### మార్చి 7 నుంచి 24 వరకు హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్లు

- యూఎస్‌సీఐఎస్ కీలక ప్రకటన
- ట్రంప్ అధికారంలోకి వచ్చాక వీసాల జారీపై తొలి నిర్ణయం
- ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న కంపెనీలు

వివరాలు 3లో




# ఢిల్లీ దిల్ గెలిచిందెవరు?

## నేడే కౌంటింగ్


ఉదయం 11 గంటలకల్లా ఫలితాలు.. మొత్తం స్థానాలు 70, మ్యాజిక్ ఫిగర్ 36

ఆప్ హ్యాట్రిక్ సాధిస్తుందా?.. కమలం వికసిస్తుందా?

బీజేపీ వైపు ఎగ్జిట్ పోల్స్ మొగ్గు.. ఎప్పుడూ అవి తమకు రివర్స్ అంటున్న ఆప్

వివరాలు 2లో

### ఎగ్జిట్ పోల్స్ అంచనాలు




# రాహుల్‌కు.. నాకు గ్యాప్ లేదు

**మా అనుబంధం తెలియని వారు ఏం మాట్లాడుకుంటే ఏం?**

మంత్రివర్గ విస్తరణ హైకమాండ్ నిర్ణయం.. నేను ఎవరిపేరు సిఫార్సు చేయను

పార్టీ అగ్ర నేతల మనోభావాలకు అనుగుణంగానే నడుచుకుంటా

వ్యక్తిగత నిర్ణయాలు ఏమీ ఉండవు.. కులగణనతో ముస్లిం రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం

పీసీసీ కార్యవర్గం కొలిక్కి.. ఒకటిరెండు రోజుల్లో ప్రకటన

ఢిల్లీలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ఢిల్లీ, మహా :** ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ లేనట్లేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సీఎం మంత్రివర్గంలో ఎవరెవరు ఉండాన్నది అధిష్ఠానానిదే నిర్ణయమన్నారు. తాను ఎవరి పేరూ సిఫారసు చేయడం లేదని స్పష్టం చేశారు. అయితే పీసీసీ కార్యవర్గ కూర్పుపై రెండు మూడు రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు. పాలనలో కానీ, నిర్ణయాలలో కానీ తన వ్యక్తిగతం ఏమీ లేదని, అన్నీ అధిష్టానం దృష్టిలో పెట్టి అనుమతి తీసుకుని చేసేవేనని తెలిపారు. పార్టీకి అధిష్టానం భాస్, బాస్ తీసుకున్న నిర్ణయాలను పాటిస్తామని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతల కేసుల విషయంలో చట్ట ప్రకారమే ముందుకు వెళ్తామన్నారు. ఇప్పటికిప్పుడు అరెస్ట్ చేయించి, జైల్లో వేయాలనే ఆలోచన లేదన్నారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా పని చేస్తున్నానన్నానని తెలిపారు.

**కులగణన ఆషామాషీ కాదు**

కులగణన ఆషామాషీగా చేసింది కాదని సీఎం తెలిపారు. ఎంతో జాగ్రత్తగా, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని చేశామని వివరించారు. సర్వే ప్రకారం బీసీలు 5.30 శాతం పెరిగారని చెప్పారు. లెక్కలతో సహా చూశాక బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్ ఈ విషయాన్ని ఒప్పుకున్నారని వెల్లడించారు.

మిగతా 2లో



### హస్తినలో హాట్ పాలిటిక్స్

- ఖర్గేను కలిసిన రేవంత్, పీసీసీ చీఫ్
- నేతలతో కేసీ వేణుగోపాల్ చర్చలు
- తాజా రాజకీయ పరిణామాలపై ఆరా
- పీసీసీ కార్యవర్గం, డిసిసిలకు గ్రీన్ సిగ్నల్
- మంత్రివర్గం, నామినేటెడ్ పదవులకు రెడ్ సిగ్నల్

02

# మోదీకి కృతజ్ఞతలు తెలిపిన నాగార్జున

**మోదీకి కృతజ్ఞతలు తెలిపిన నాగార్జున.. ప్రధానిని కలిసిన అక్కినేని ఫ్యామిలీ**

తెలుగు సినిమా విజయాల్లె ఏఎన్‌ఆర్ పాత్ర

ఏడు దశాబ్దాల పాటు భారతీయ సంప్రదాయాలు, విలువలకు ప్రాణం పోశారు

అక్కినేనిపై మోదీ ప్రశంసల జల్లు



**హైదరాబాద్, మహా:** ప్రధాని మోదీని టాలీవుడ్ నటుడు అక్కినేని నాగార్జున తన ఫ్యామిలీ సమేతంగా కలిశారు. నంద్యాల ఎంపీ ఎంపీ బైరెడ్డి శబరితో కలిసి నాగార్జున, భార్య అమల, కుమారుడు నాగ చైతన్య, కోడలు శోభిత దూళ్లిపాల పార్లమెంట్‌లోని టీడీపీ ఆఫీసుకు వెళ్లారు. అక్కడే నాగార్జున కుటుంబాన్ని ప్రధాని మోదీ కలిసినట్లు ఎంపీ శబరి పేర్కొన్నారు.

మిగతా 2లో

# 10 తర్వాత స్థానిక ఎన్నికలు

**రంగం సిద్ధం చేసిన ఎన్నికల కమిషన్**

- ఫిబ్రవరి 10లోపు పీవో, ఏపీవోల నియమకాలు
- 15లోగా శిక్షణ పూర్తి
- ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే అవకాశం

వివరాలు 2లో



# మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో అక్రమాలు

- 5 నెలల్లో 39 లక్షల మంది ఓటర్ల చేర్పు
- ఇదేం ఎన్నికల నిర్వహణ
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ధ్వజం

**ఢిల్లీ, మహా :** మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. పార్లమెంటు, శాసన సభ ఎన్నికల మధ్య 5 నెలల కాలంలో కొత్తగా 39 లక్షల మంది ఓటర్లు చేరినట్లు తెలిపారు. అదెలా సాధ్యమని ప్రశ్నించారు.

మిగతా 2లో



# మోదీకి కృతజ్ఞతలు తెలిపిన నాగార్జున



(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా అక్కినేని నాగేశ్వరరావు పుస్తకాన్ని ప్రధాని మోడీకి అందజేశారు. ఈ సందర్భంగా తన తండ్రి వారసత్వాన్ని గౌరవించినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. సినిమా, సమాజం కోసం ఏఎన్ఆర్ చేసిన కృషిని మోడీ అభినందించారు. తెలుగు సినిమా ఇవ్వాళ ఇంత ఎత్తు ఎదగడంలో ఏఎన్ఆర్ పాత్ర కూడా ఉందని మోదీ తెలిపారు. ఏడు దశాబ్దాల సినిమా కెరీర్‌లో భారతీయ సాంప్రదాయాలు, విలువలను అక్కినేని తన సినిమాల్లో ప్రోత్సహించారని చెప్పారు. తెలుగు సినిమా రంగం చెన్నై నుంచి హైదరాబాద్ రావడానికి అక్కినేని కూడా కీలక పాత్ర పోషించిన విషయాన్ని మోడీ గుర్తు చేశారు.

# ముస్లింలను బీసీల్లో ఎలా చేరుస్తారు?

- కులగణన జరిపిన విధానమే సరిగా లేదు
- కాంగ్రెస్ పై కిషన్ రెడ్డి ఫైర్



**ఢిల్లీ, మహా:** హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అని ఏ చట్టంలో ఉందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముస్లింలను బీసీల్లో ఎలా కలుపుతారని నిలదీశారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. దీనిపై రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అసలు కులగణన జరిపిన విధానమే సరిగా లేదని, 50 శాతం ఇళ్లకు సర్వే సిబ్బంది వెళ్లనేలేదని ఆరోపించారు. తెలంగాణలో కులగణన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు చర్య వల్ల బీసీల సంఖ్య తగ్గిందన్నారు. ఇది చాలా విచారకరం అని చెప్పారు. తూతూమంత్రంగా సర్వే చేశారని విమర్శించారు. ఈ సర్వేపై అనేక బీసీ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు.

# ఢిల్లీ దిల్ గెలిచిందెవరు?




## నేడే కౌంటింగ్

### ఉదయం 11 గంటలకల్లా ఫలితాలు.. మొత్తం స్థానాలు 70, మ్యాజిక్ ఫిగర్ 36

### ఆప్ హ్యాట్రిక్ సాధిస్తుందా?.. కమలం వికసిస్తుందా?

### బీజేపీ వైపు ఎగ్జిట్ పోల్స్ మొగ్గు.. ఎప్పుడూ అవి తమకు రివర్సే అంటున్న ఆప్




**ఢిల్లీ, మహా :** ఢిల్లీ దిల్ గెలిచిందెవరు? ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరగ్గా, 60.42 శాతం ఓటింగ్ నమోదైంది. క్రితం ఎన్నికల కంటే ఇది 1.56 శాతం తక్కువ. శనివారం ఉదయం కౌంటింగ్ ప్రారంభం కానుండగా, 11గంటలకల్లా ఢిల్లీని ఏలే రాజెవరో తేలిపోతుంది. ఆమ్ ఆద్మీ పార్టీ-ఆప్ ఆవిర్భావం నుంచి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిసారి ఎగ్జిట్ పోల్స్ ఆ పార్టీకి వ్యతిరేకంగా వచ్చాయి. 2013లో బీజేపీకి 35 సీట్లు, ఆప్‌నకు 17 సీట్లు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. కానీ ఆప్ వాటిని తారుమారు చేస్తూ 28 సీట్లు కైవసం చేసుకుంది. బీజేపీ 32 సీట్లు, కాంగ్రెస్ 8 సీట్లకు పరిమితమైంది. 2015లో ఆప్‌నకు 35-53 వరకు సీట్లు వస్తాయని, బీజేపీకి దాదాపు 25 సీట్ల వరకు రావొచ్చని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ఇక 2020లో ఆప్ దాదాపు 54 సీట్లు, బీజేపీ 15 సీట్ల వరకు గెలుస్తుందని చెప్పాయి. ఈ రెండు సందర్భాల్లోనూ ఎగ్జిట్ పోల్స్ తప్పాయి. 2015లో 70 అసెంబ్లీ స్థానాలకుగానూ ఆప్ ఏకంగా 67 నియోజకవర్గాల్లో విజయ దుందుభి మోగించింది. 2020లోనూ 62 సీట్లు సాధించింది ఆప్. తప్పతున్న ఎగ్జిట్ పోల్స్ అంచనాల నేపథ్యంలో ఢిల్లీలో ఈసారి ఎవరు విజయం సాధిస్తారనే దానిపైనే సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

2025లో బిజెపిదే విజయమని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ తేల్చాయి. 40నుండి 55వరకు బిజెపికి రావొచ్చని, 15నుండి 30వరకు ఆప్ కు రావొచ్చని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. గతంలో లాగా ఎగ్జిట్ పోల్స్ తప్పితే కేజ్రీవాల్ హ్యాట్రిక్ కొడతారు. ఢిల్లీలో పట్టు సాధించి పంజాబ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్, జాతీయ పార్టీగా ఆవిర్భవించి ఒకానొక సమయంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా మారుతుందా అనే భావన కలిగించింది. అయితే అవినీతి వ్యతిరేక పోరాటంలో పుట్టుకొచ్చిన ఆప్‌పై, అవినీతి ఆరోపణలు ఎక్కువయ్యాయి. కేజ్రీవాల్ సహా పలువురు పార్టీ అగ్రనేతలు అవినీతి ఆరోపణలపై జైలుకు వెళ్లారు. ఈ పరిణామాలతో ఆప్ ప్రతిష్ఠకు భంగం వాటిల్లిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఢిల్లీలో కాలుష్యంపైనా ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంది ఆప్. ఈ నేపథ్యంలోనే ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఆప్‌నకు వ్యతిరేకంగా వెలువడ్డాయి. ఒకవేళ వీటన్నింటినీ దాటుకుని ఆప్ గెలిస్తే ఆప్‌నకు తిరుగుండదు. మరోసారి చరిత్ర సృష్టించినట్టే అవుతుంది.

**కౌంటింగ్‌కు భద్రత**

ఓట్ల లెక్కింపు జరిగే 19 కౌంటింగ్ కేంద్రాల్లో రెండు పారా మిలిటరీ బలగాలు, ఢిల్లీ పోలీసులతో మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల లోపలికి గుర్తింపు కలిగిన సిబ్బందిని మాత్రమే అనుమతిస్తామని స్పెషల్ సీపీ దేవేశ్ చంద్ర తెలిపారు. లెక్కింపు కేంద్రం ప్రాంతంలో సెల్‌ఫోన్ వాడకాన్ని నిషేధించినట్లు వెల్లడించారు. కౌంటింగ్ సమయంలో రాకపోకలు సజావుగా జరిగేలా ట్రాఫిక్ నిర్వహణ ప్రణాళికను రూపొందించారని చెప్పారు.

# 10 తర్వాత స్థానిక ఎన్నికలు


- రంగం సిద్ధం చేసిన ఎన్నికల కమిషన్
- ఫిబ్రవరి 10లోపు పీవో, ఎపివోల నియమకాలు
- 15లోగా శిక్షణ పూర్తి
- ముందుగా ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలు నిర్వహించే అవకాశం

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నగారా మోగనుంది. ఈనెల 10 తర్వాత స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు అందినట్లు ఎన్నికల కమిషన్ వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 10లోగా ఎన్నికల సిబ్బందిని నియమించుకోవాలని ఈసీ అధికారులను ఆదేశించింది. ఫిబ్రవరి 15లోగా ఎవో, ఎపివోల శిక్షణ పూర్తికానుంది. తాజా సన్నద్ధత ప్రకారమైతే ఈనెలలోనే తొలివిడత ఎన్నికలు ముగియనున్నాయి. 24న తొలిదశ, మార్చి 3న రెండోదశ, మార్చి 10న మూడోదశ జరపాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ముందుగా ఎంపిటిసి, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. బిసి కులగణన, ఎస్సీ వర్గీకరణతో గ్రామాల్లో తీవ్ర చర్చ జరుగుతుండగా, ప్రభుత్వానికి అనుకూల వాతావరణం ఏర్పడిన ఇదే సరైన సమయమని కాంగ్రెస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో వ్యూహరచనలో నిమగ్నమైన ప్రభుత్వపెద్దలు. కాంగ్రెస్ అగ్రనేతలు కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. గత కొంతకాలంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యేలకు, నేతలకు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నోటిఫికేషన్ విడుదలకు రంగం సిద్ధమైంది.

# తెలంగాణ జన సైనికుల్లో జోష్

## గాజు గ్లాసు గుర్తుకు ఓకే.. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం


### లోక్ బాడీ ఎన్నికల నేపథ్యంలో కీలక పరిణామం



**మహా :** తెలంగాణలో జనసేన పార్టీకి ఎన్నికల సంఘం తీపికబురు చెప్పింది. ఏపీతో పాటు తెలంగాణలో కూడా జనసేన పార్టీకి గుర్తింపు దక్కింది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి గాజు గ్లాసు గుర్తును కేటాయించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. జనసేన పార్టీని ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ పార్టీగా గుర్తించామని, దానికి అనుగుణంగా తెలంగాణలోనూ గుర్తించాలని, గాజుగ్లాసు గుర్తు ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘం కోరింది. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర ఎన్నికల సంఘానికి, ఆ పార్టీ లీగల్ సెల్ ఛైర్మన్‌కు లేఖ రాశారు. ఈ మేరకు జనసేన పార్టీని తెలంగాణలో కూడా గుర్తిస్తూ ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ పార్టీగా గుర్తింపు పొందిన జనసేన పార్టీని గుర్తిస్తూ గాజు గ్లాసు గుర్తు కేటాయించిన సంగతి తెలిసిందే.

గత నెలలోనే ఆంధ్రప్రదేశ్‌లో జనసేన పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం గుర్తింపు లభించిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల జాబితాలో జనసేన పార్టీ కూడా చేరింది. నిబంధనల ప్రకారం ఆ పార్టీకి గాజు గ్లాసు గుర్తును రిజర్వ్ చేసింది ఎన్నికల సంఘం. ఈ మేరకు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి లేఖ కూడా అందింది. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ ఘన విజయాన్ని అందుకుంది. ఆ ఎన్నికల్లో జనసేన పార్టీ 100 స్ట్రైక్‌రేట్‌తో గెలుపును అందుకుంది. అలాగే 100 శాతం స్ట్రైక్‌రేట్ పార్టీగా జనసేన రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. మొత్తం 21 అసెంబ్లీ స్థానాలు, 2 లోక్‌సభ స్థానాల్లో పోటీచేసి అన్ని చోట్లా ఘన విజయాన్ని సాధించింది. ఈ క్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం జనసేన పార్టీని ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ పార్టీగా గుర్తిస్తూ గుర్తును రిజర్వ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పుడు తాజాగా తెలంగాణలో కూడా పార్టీని గుర్తిస్తూ గాజు గ్లాస్ గుర్తును కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. దీంతో జనసైనికులు జోష్‌లో ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో జనసేనకు అధికారిక చిహ్నాన్ని కేటాయిస్తూ ఈసీ నిర్ణయం తీసుకోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ మరింత పెరిగింది. ఏపీతో పాటు తెలంగాణలోనూ జనసేనకు కార్యకర్తలున్నారు. అయితే ఏపీపైనే ప్రత్యేక ఫోకస్ పెట్టిన జనసేనాని తెలంగాణలో పార్టీ విస్తరణపై దృష్టి అంతగా పెట్టం లేదు. ఈ నేపథ్యంలో ఈసీ తాజా నిర్ణయంతో ఏపీతో పాటు పవన్ తెలంగాణలోనూ పార్టీ విస్తరణకు ప్రయత్నాలను వేగవంతం చేస్తారని అంటున్నారు. త్వరలోనే స్థానిక సంస్తలకు ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతున్న తరుణంలో ఇక్కడ పార్టీని బలోపేతం చేసేందుకు ఇదే మంచి అవకాశమని, జనసైనికులు అంటున్నారు. తెలంగాణకు చెందిన జనసన నేతలు త్వరలోనే పవన్ కళ్యాణ్ తో భేటీ అయి స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహంపై చర్చించేందుకు సన్నద్ధమవుతున్నారు.

# ఓయూలో టెన్షన్... టెన్షన్...



**మహా :** విద్యార్థుల ఆందోళనతో ఉద్రిక్తంగా మారిన ఉస్మానియా యూనివర్సిటీ , అడ్మిషన్ బిల్డింగ్ ను ముట్టడించిన విద్యార్థులు శుక్రవారం మధ్యాహ్నం నుండి ధర్నాకు దిగిన సైన్స్ విద్యార్థులు , పీజీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయలని డిమాండ్ , నెట్ ఎగ్జాము అయ్యేంత వరకు మినహాయింపు ఇవ్వాలని ఆందోళన, వందలాదిమంది విద్యార్థుల ఆందోళనలతో పరిసరాలలో ఉద్రిక్తత. చీకటి పడ్డ కూడా ఆందోళన విరమించని విద్యార్థిని విద్యార్థులు , డిన్నర్ ను కూడా బహిష్కరించిన నిరసనకారులు.

# మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో అక్రమాలు



(మొదటిపేజీ తరువాయి)

అందువల్ల తమకు ఓటర్ల జాబితా ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. దిల్లీలో శివసేనఉద్ధవ్ ఠాక్రే వర్గం నేత సంజయ్ రౌత్, ఎన్సీపీ శరద్ చంద్ర పవార్ వర్గం నాయకురాలు సుప్రియా సూలేతో కలిసి రాహుల్ గాంధీ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం 9.54 కోట్ల మంది వయోజనులు ఉండగా ఓటరు జాబితాలో ఆ సంఖ్య 9.7 కోట్లు ఉండటంపై అనుమానం వ్యక్తం చేశారు. 201924 మధ్య కాలంలో కొత్తగా 32 లక్షల మంది ఓటర్లు చేరగా పార్లమెంటు ఎన్నికల తర్వాత కేవలం 5 నెలల కాలంలో కొత్తగా 39 లక్షల మంది ఓటర్లు చేరినట్లు తెలిపారు. ఈసీ మహారాష్ట్ర ఓటర్ల జాబితా ఇవ్వకుంటే తాము కోర్టుకు వెళ్తామని రాహుల్ గాంధీ హెచ్చరించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లు మేం గుర్తించామని ఎన్నికల సంఘానికి చెబుతున్నాం. పేరు, చిరునామా, ఫొటోతో కూడిన ఓటర్ల జాబితా ఇవ్వాలని కోరుతున్నాం. పార్లమెంటు, శాసనసభ ఎన్నికల ఓటర్ల జాబితా కావాలని అడుగుతున్నాం. కొత్తగా చేరిన ఈ ఓటర్లు ఎవరో తెలుసుకోవాలని ఉంది. మరో కోణాన్ని కూడా మేం గుర్తించాం. అది తెలుసుకోవాలని అనుకుంటున్నాం. ఎంతో మంది పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. ఒక బూత్‌లోని ఓటర్లను మరో బూత్‌లోకి మార్చారు. వారంతా దళితులు, గిరిజనులు, మైనార్టీలు. ఈ మతలబు ఏంటో తెలుసుకోవాలని ఉంది. అనేకసార్లు ఈ విషయాన్ని ఈసీకి దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు అని రాహుల్ ధ్వజమెత్తారు.

**లిఖితపూర్వకంగా స్పందిస్తాం: ఈసీ**

రాహుల్ గాంధీచేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. రాజకీయ పార్టీలు లేవనెత్తిన ప్రశ్నలను, సూచనలను తాము గౌరవిస్తున్నామని, త్వరలో లిఖితపూర్వకంగా స్పందిస్తామని పేర్కొంది. మహారాష్ట్ర ఓటర్లకు సంబంధించి పూర్తి వాస్తవాలు, విధానపరమైన అంశాలతో కమిషన్ సమాధానం ఇస్తుందని తెలిపింది.

# రాహుల్‌కు.. నాకు గ్యాప్ లేదు

(మొదటిపేజీ తరువాయి)

అలాగే ముస్లిం రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం దక్కుతుందని భావిస్తున్నానని అన్నారు. తాను రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కోరలేదన్నారు. ప్రభుత్వం, పార్టీ తీసుకునే అన్ని కీలక నిర్ణయాలు అధిష్ఠానం దృష్టిలో ఉంటాయని తెలిపారు. అధిష్ఠానానికి తెలియకుండా నిర్ణయాలు ఉంటాయని తెలియని వాళ్లు అనుకుంటే చేసేదేమీ లేదని వివరించారు.

**పార్టీ ఇచ్చిన పని పూర్తిచేయడమే నా లక్ష్యం**

పార్టీ, పార్టీ అగ్ర నేతల మనోభావాలకు అనుగుణంగానే నడుచుకుంటానే తప్ప, వ్యక్తిగత నిర్ణయాలు ఎప్పుడూ ఉండవని సీఎం రేవంత్ అన్నారు. పార్టీ ఇచ్చిన పని పూర్తి చేయడమే తన లక్ష్యమని అన్నారు. రాహుల్ గాంధీకి, తనకు మధ్య ఉన్న అనుబంధం గురించి తెలియని వాళ్లు ఎన్ని మాట్లాడుకున్నా తనకేం కాదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీకి నాకు ఉన్న సాన్నిహిత్యం ఏమిటన్నది చెప్పాల్సిన అవసరం కూడా లేదన్నారు. పని చేసుకుంటూ పోవడమే తనకు తెలుసునని, ప్రతి ఒక్క విమర్శకు స్పందించాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



# హస్తినలో హాట్ పాలిటిక్స్

## ఖర్గేను కలిసిన సీఎం రేవంత్, పీసీసీ చీఫ్

### నేతలతో కేసీ వేణుగోపాల్ చర్చలు.. తాజా రాజకీయ పరిణామాలపై ఆరా

### పిసిసి కార్యవర్గం, డిసిసిలకు గ్రీన్ సిగ్నల్.. మంత్రివర్గం, నామినేటెడ్ పదవులకు రెడ్ సిగ్నల్

**మహా, నేషనల్ బ్యూరో:** హస్తినలో కాంగ్రెస్ రాజకీయాలు హాట్ హాట్ గా మారాయి. హైదరాబాద్ నుండి బయలుదేరినపుడు మంత్రివర్గ విస్తరణ కొలిక్కివచ్చినట్లేనని భావించిన నేతలు ఢిల్లీకి వెళ్ళాక అధిష్టానం ఇతర అంశాలపై చర్చించడంతో నిరుత్సాహానికి గురయ్యారు. ఢిల్లీకి మంత్రివర్గ ఆశావహులు భారీగా చేరుకున్నారు. సీఎం, పీసీసీ చీఫ్ ఢిల్లీ వెళ్లగానే పలువురు నేతలు మంత్రివర్గంపై ఆశతో విమానమెక్కి హస్తిన చేరారు. అయితే శుక్రవారం పరిస్థితి ఆశాజనకంగా కనిపించలేదు. రాహుల్ గాంధీ మహారాష్ట్ర నేతలతో చర్చల్లో ఉండడం, ఢిల్లీ ఫలితాలపై నజర్ ఉండడంతో నేతలు ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గేను కలిశారు. బిసి కులగణనపై సీఎంను,ప్రభుత్వాన్ని ఆయన అభినందించారు. కులగణన పూర్తి చేసి స్థానిక ఎన్నికలకు వెళ్ళేందుక సిద్దమవుతున్న తరుణంలో ఖచ్చితంగా మంత్రివర్గ విస్తరణ ఉంటుందని నేతలు భావించగా, మళ్ళీ మాట్లాడుదాం అని హైకమాండ్ చెప్పినట్లు తెలుస్తోంది.

**ఖర్గేతో సీఎం చర్చలు**

సీఎం రేవంత్ రెడ్డి పార్లమెంట్‌లో ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేను కలిశారు. కేబినెట్ విస్తరణ, నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు సమాచారం. అలాగే రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ పని తీరు గురించి ఖర్గేకు రేవంత్ రెడ్డి వివరించినట్లు తెలుస్తోంది. కాగా సీఎం రేవంత్ రెడ్డి వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఉన్నారు.

**విడివిడిగా చర్చించిన కేసీ వేణుగోపాల్**

మరోవైపు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ తెలంగాణ ముఖ్యనేతలతో విడివిడిగా చర్చలు జరిపారు. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి దీపా దాస్ మున్షీతో చర్చించారు. పీసీసీ కార్యవర్గ కూర్పు, కేబినెట్ విస్తరణపై నేతల అభిప్రాయాలను వేణుగోపాల్ సేకరించారు. పీసీసీ కార్యవర్గం ప్రకటించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒకట్రెండు రోజుల్లో అధికారికంగా పీసీసీ కార్యవర్గాన్ని ప్రకటించనుండగా.. అందులో సామాజిక సమీకరణాలు బేరీజు వేసుకుని ఒక మాదిగ, ఒక ముస్లిం, ఒక లంబాడా, ఒక రెడ్డి వర్గాలతో నలుగురు కార్యనిర్వాహక అధ్యక్షులు ఉండనున్నట్లు సమాచారం. గతంతో పోలిస్తే ఈ సారి కార్యవర్గం చిన్నగా ఉండే అవకాశం ఉంది.

# త్రిశంఖు స్వర్గం!?



వధుల్లో విచ్చలవిడిగా తిరిగే వీధి కుక్కలను పట్టి మున్సిపాలిటీ డొక్కు బండిలో కుక్కి ఊరుబయటనో? లేక దూరంగా వదిలి రావడం మనముందు కన్పించే సాదారణ దృశ్యం! అలాగే అడవిలో ఉండాల్సిన కోతులు అడవి విధ్వంసంతో ఊళ్ళమీద దండయాత్ర చేసినప్పుడు వాటిని పట్టి తిరిగి అడవిలో వదిలేయడం మనం చూస్తున్న మరో సాదృశ్యం!! ఇలాంటి అమానవీయ మూడో దృశ్యం అమెరికా అధ్యక్ష పీఠం పై రెండవసారి ఎక్కిన ట్రంప్ బారతీయ అక్రమ వలసదారుల పేరుతో కొందరు బారతీయ పౌరులను తమ మిలిట్రీ విమానం లో కుక్కి నేరుగా తెచ్చి పంజాబ్ గడ్డమీద వదిలివేయడం!? ఇంకా ఏడు లక్షల పైచిలుకు బారతీయ అక్రమ వలసదారులు ఉన్నారని ప్రకటించడం !చేసిన చర్య ఓమచ్చు ఘటనగా ప్రస్తావించడం జరిగిపోయిన సంఘటనేకావచ్చును. నిజంగా ఈసమస్య చూడడానికి చిన్నదిగా కనిపించవచ్చు నేమో!కానీ,మనదేశ పరువు, ప్రతిష్ట దృష్ట్యా చూసినప్పుడు ఈసంఘటన అమానవీయ మైనదే? అంతర్జాతీయ చట్టాలకు లోబడి ఏదేశమైన తమపౌరులు బాద్యత తామే చూసుకునే అవకాశం కల్పించడానికి అనేక దౌత్య అవకాశాలు ఉన్నాయి? అయినా ఈబలవంతమైనచర్య!, ఒకరకంగా అగ్రరాజ్యం అమెరికా దురహంకార వైఖరిలో ఇదీ అంతర్భాగం కావచ్చు నేమో! లేక పరోక్షంగా హెచ్చరికా అయివుండవచ్చు! కానీ, దేశభక్తియుత కోణంలో చూసినప్పుడు బారతీయ పౌరులు గా మనకు ఇది మింగుడు పడని అంశమే? మన ఆత్మగౌరవాన్ని గాయపరిచిన సంఘటనే?ఒకప్పుడు మనదేశం నుండి అమెరికాతో సహా ప్రపంచ దేశాలన్నింట మేధోవలస లుండేవి!అవి కాస్తా ఇప్పుడు అవి "పని"వలసలుగా మారిపోయాయి.మనదేశంలో ఇంజనీరింగ్, మెడిసిన్ చదవాలంటే ఒక్కొక్క యువతపై ప్రభుత్వం లక్షల సొమ్ము వెచ్చించాలసివస్తుంది.అంటేఆయా విద్యార్థుల పై ప్రజలు పన్నుల ద్వారా వచ్చే సొమ్ము నే ప్రభుత్వం ఖర్చు పెడుతుంది.సంపూర్ణమేదావిగా తీర్చిదిద్దిన ఆ పౌరుడు ఆయా దేశాల కరెన్సీని బేరీజు వేసుకుని, కల్పించే సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని అమెరికా, బ్రిటన్,కెనడా, ఆస్ట్రేలియా,జర్మనీ,ఇటలీ లాంటి పాశ్చత్య దేశాలకు వలసలు పోయారు.అదే తమ త్రిశంఖు స్వర్గం గా భావించారు?భ్రమల లోకంలో వ్రేలాడడమే త్రిశంఖు స్వర్గం!అదిగతకాలపు "మేధో "వలసగా మనం చెప్పుకున్న ప్పటికీ ,మానవవనరుల పై పెట్టుబడి మనదైతే సేవలు అందుకునే బాగ్యం మాత్రం విదేశీయులకు దక్కింది.ఇదిఎంతవరకుస బబు!?. ఇక 21వశతాబ్దంలోకి ప్రవేశించిన తర్వాత ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విదానాలు నిభందనలు సరళీకరణ తో ప్రపంచం ఓ కుగ్రామం గా మారిపోయింది.ఫలితంగా వలసలు విపరీతంగా పెరిగిపోయాయి.మనరూపాయివిలువరోజురోజుకు దిగజారడం, విదేశీ కరెన్సీ పై మోజు పెరిగింది.ఇప్పుడు మేధో వలసల కాస్తా పని కోసం వలసలు గా మారిపోయింది.చివరకు వ్యవసాయ కూలీలు సైతం పనికోసం గల్ఫ్ దేశాలకు వలస వెళుతుంటే?విద్య పేరుతో అమెరికా, బ్రిటన్,కెనడా, ఆస్ట్రేలియా లాంటి దేశాలకు వెళ్ళిన యువకులు తమ విద్యకు తగిన ఉద్యోగాలు లభించక వివిధ రకాల మాల్స్, పెట్రోల్ పంపులు, ఇంటిపనులు ,ఇంటిపనులు ఇలా గంటల ఉద్యోగులు గామారి ఒకరకంగా జీవన నరకం అనుభవిస్తున్నారు. అయినా ఇక్కడ మనం దూరపు కొండలు నునుపు అన్న సామెతను గుర్తు చేసుకొని సంతృప్తి పడుతున్నాము. విదేశాలలో నివశిస్తున్న యువతకు ఇప్పుడు వివాహాలు కూడా సమస్యగా మారిపోయింది.ప్రపంచ జనసంఖ్య లో రెండవ స్థానం నుండి మోదటి స్థానంలోకివిగబాకబోతున్న మన భారతదేశం లో పనిచేయగల వయస్సున్న యువతకు కొదవలేదు.కానీ, దేశంలో యువత శక్తిని, యుక్తిని వినియోగించే ప్రణాళిక మాత్రంమన దేశ పాలకవర్గాలకు లేదు?ఒకరకంగా శూన్యం! ఓట్లు వేటలో ఉచిత పథకాలను ప్రకటించి తాత్కాలిక పబ్బం గడుపు కోవడం తప్ప దీర్ఘకాలిక ప్రణాళికలు తమపౌరులకోసం రూపొందించే రాజకీయ నాయకులు ఇప్పుడు మచ్చుకు కూడా కనిపించడం,వినిపించడంలేదు? ఉపాధి, ఉద్యోగం,పనికల్పన డిమాండ్ రాకుండా ఉండాలంటే అప్పోసప్పో చేయించి, కాకుంటే అందులో కాస్తా చెయ్యేసి యువతను విమానం ఎక్కించి సరిహద్దులు దాటించే పనిపైనే పాలకవర్గాలు ఎక్కువగా ఉన్నాయి.ఉపాధి, ఉద్యోగం కల్పించాలనే డిమాండ్ నుండి పారిపోవడమే పాలకవర్గం తేలికైన మార్గం గా ఎంచుకుంటుంది..ఎందుకంటే ఈ దేశంలో ఉపాధి కల్పన,ఉద్యోగాలకల్పన అన్నమాటే అడ్రస్ లేకుండా చేశారు మన పాలకులు!.త్రిశంఖు స్వర్గం లాంటి మేధోవలస లేదా పని వలసలకు అలవాటు పడిన యువత అవమానాలు పాలైనా కరెన్సీ విలువ కు విలువనిచ్చి వలసబ్రతుకులతో కష్టాలు, నష్టాలుతో పరాయి పంచన గడుపుతున్నారు.

ఈత్రిశంఖు స్వర్గం మూలంగానే ప్రపంచంలో అత్యున్నతంగా విలసిల్లిన, ఎలాంటి ఆర్థిక సంక్షోభాలనైనా తట్టుకోగలిగిన, మన గ్రామీణ వ్యవసాయ స్వయంపోషక వ్యవస్థకుప్పకూలి, క్రమంగా కనుమరుగవుతుంది? ఇప్పటికే గ్రామాల్లో 25శాతం ఇండ్లు తాళాలతోపడావుపడి దర్శనం ఇస్తున్నాయి. మేథో,పని వలసలతో పిల్లలు విదేశాలకు వెళుతుంటే! వృద్దులు గా మారిన పూర్వీకులు ఆసరా కోల్పోయి అంతర్థానం కావడంమినహా మరో ప్రత్యామ్నాయం కానరావడంలేదు,మంచి మంచి గృహాలు నిర్వాహణలేక పాడుబడిపోతున్నాయి. పచ్చనిపంటపొలాలు బీడు భూములుగా మారుతున్నాయి.మంచిసంస్కృతి సాంప్రదాయాలుతో విలసిల్లిన మనపల్లెలు వల్లకాడుగా మారే స్థితికి ఇంకా ఎంతకాల మోపట్టదు!వేచి చూడాల్సిన పనిలేదు?ఆపెనువిషాదం దరిదాపుల్లోనే పొంచివుంది.దేశానికి పట్టుగొమ్మలైన పల్లెలు కట్టు,పట్టు తప్పితే దేశంలో కన్పించేది ఇక స్మశాన వైరాగ్యంనే!? ఇలాంటి స్థితిలో కూడా పాలకుల ఆలోచనలలో మార్పు ఎంతమాత్రం లేదు.ఇక్కడపుట్టి



-ఎన్.తిర్మల్,
(సీనియర్ జర్నలిస్టు, రచయిత,కవి, సామాజిక కార్యకర్త)
సెల్;9441864514,
E-mail: thirmal.1960@gmail.coM

నపౌరుడు ఇక్కడే సేవలుఅదించి ఈదేశ అభివృద్ధి కోసం పాటుపడే దేశభక్తియుత యువత అవసరం ఇప్పుడు ముందుకొచ్చింది.తుమ్మితే,దగ్గితే సంక్షోభం పాలై 'త్రిశంకు' స్వర్గం లాంటి పాశ్చత్య దేశాల మోజు నుండి యువత బయటపడాలి.మనవనరులు ,మానవ వనరులను మనమే సరిగా వినియోగించుకునే వ్యవస్థ గురించి ఆలోచన చేయాల్సిన అవసరం మన ప్రజలు, పాలకుల ముందున్న ప్రదాన సమస్యగా ముందుకొచ్చింది.మనం ఇతరదేశాల కోసం దేబురించే స్థితి నుండి మనమీద ఇతర దేశాలు ఆధారపడే స్థితి కోసం ఎదురు చూద్దాం.అందుకోసం మన వనరులు, ప్రణాళికలు సిద్ధం చేద్దాం!ఆత్మగౌరవం, దేశభక్తి యుత పౌరులు గాఎదగడమే మనముందున్న కర్తవ్యం.ఒకరి ముందు తలవంచడం కాదు!తలఎత్తుకొని నిలిచే స్థితి ఇప్పుడు మనకవసరం!అందుకోసం మనపల్లె పట్టుల్లో పచ్చదనం కాపాడుకోవాలి.పదిమందికి ఇక్కడే ఉపాధి కలిగించే ప్రణాళికలు, ప్రాజెక్టులకు పాలకులు రూపకల్పన చేయాలి.మనపిల్లలను కూడా డాలర్,రూబుల్ కలలకు దూరంగా ఉంచి దేశభక్తి బీజాలు నాటాలసిన సమయం ఆసన్నమైంది.త్రిశంకు స్వర్గమును వదిలి మన కుటుంబాలమద్య మనం ఆనందంగా, పరిపూర్ణం గా, నిర్భయంగా సంచరించే స్వర్గ దామం మన ముంగిటే మన ముందేనిర్మించుకుందాం!అందుకు ప్రజలు ఆలోచన సరళిలో మార్పుతో పాటు పాలకుల చర్యల్లో,నిర్ణయాల్లో స్వార్థన్ని నిలువునా చంపుకోవాలి. మార్పు సాధ్యమేనా? త్రిశంకు స్వర్గానికి బదులు శ్రమ సౌందర్యం తో నిండిన పరిపూర్ణ మైన నిజమైన స్వర్గం నిర్మిద్దాం.ఆవైపుగా మన ఆలోచనలు ఇప్పుడు పరుగులు తీయాల్సిన అవసరం ఉంది.ఆదిశగా మన ఆలోచనలు మళ్ళిద్దాం!

## మార్చి 7 నుంచి 24 వరకు
# హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్లు

**యూఎస్‌సీఐఎస్ కీలక ప్రకటన**

**ట్రంప్ అధికారంలోకి వచ్చాక వీసాల జారీపై తొలి నిర్ణయం**
**ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న కంపనీలు**

**మహా :** భారత ఐటీ నిపుణులకు అత్యంత కీలకమైన అమెరికా హెచ్1బీ వీసాల ఇనీషియల్ రిజిస్ట్రేషన్ తేదీలపై ప్రకటన వెలువడింది. 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రక్రియ మార్చి 7న ప్రారంభమై, మార్చి 24తో ముగియనుంది. ఈ మేరకు అమెరికా సిటిజెన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్ సీఐఎస్) వెల్లడించింది.మార్చి 7 నుంచి 24లోగా యూఎస్‌సీఐఎస్ అధికారిక ఆన్‌లైన్ ఖాతా ద్వారా అర్హతలు కలిగిన కంపెనీలు ఇనీషియల్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపింది.

హెచ్1బీ వీసాల ఇనీషియల్ రిజిస్ట్రేషన్ ఎవరెవరికి అవసరమో వారందరి సమాచారాన్ని డిజిటల్‌గా నమోదు చేయాలని యూఎస్‌సీఐఎస్ నిర్దేశించింది. ఈ క్రమంలో కంపెనీలన్నీ ప్రతీ లబ్ధిదారుడి తరఫున రూ. 18,801 (215 అమెరికా డాలర్లు) చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. 2025 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశ పెట్టిన లబ్ధిదారుడి కేంద్రీకృత ఎంపిక ప్రక్రియ ప్రాతిపదికన 2026 ఆర్థిక సంవత్సరంలోనూ హెచ్1బీ వీసాలపై పరిమితిని అమలు చేస్తామని యూఎస్‌సీఐఎస్ స్పష్టం చేసింది. మార్చి 24 తర్వాత దరఖాస్తులను స్క్రూటినీ చేసి, అర్హులైన వారిని ఎంపిక చేసి వారికి చెందిన యూఎస్‌సీఐఎస్ ఆన్‌లైన్ ఖాతాలకు సమాచారాన్ని పంపిస్తారు. అమెరికాలో ఆర్థిక సంవత్సరం ఏటా అక్టోబరు 1న ప్రారంభమవుతుంది. ఈ లెక్కన అమెరికాలో 2026 ఆర్థిక సంవత్సరం అనేది ఈ ఏడాది అక్టోబరు 1న మొదలవుతుంది. ఇప్పుడు దీని కోసమే హెచ్1బీ వీసాల ఇనీషియల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టారు. హెచ్1బీ అనేవి నాన్ ఇమిగ్రెంట్





రకానికి చెందిన వీసాలు. సాంకేతిక నిపుణులు, సాంకేతిక అంశాల్లో నిష్ణాతులుగా ఉన్న వారికి ఈ వీసాలను అమెరికా జారీ చేస్తుంటుంది. వీటి ద్వారా ప్రపంచంలో అత్యధికంగా లబ్ధిపొందేది భారతీయులు, చైనీయులే. అమెరికాలోని టెక్ కంపెనీలు హెచ్1 బీ వీసాలతోనే భారత్, చైనాకు చెందిన వేలాది మంది టెక్ నిపుణులను ఉద్యోగాల్లోకి తీసుకుంటాయి. ఏటా అమెరికా 6.50 లక్షల హెచ్1బీ వీసాలను జారీ చేస్తుంటుంది. అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించిన విదేశీయులకు ప్రతి సంవత్సరం 20వేల వీసాలను జారీ చేస్తుంది.

**72 శాతం హెచ్-1బీ వీసాలు భారతీయులకే : కేంద్ర ప్రభుత్వం**

2022 అక్టోబరు నుంచి 2023 సెప్టెంబరు మధ్య కాలంలో అమెరికా నుంచి హెచ్1బీ వీసాలు అందుకున్న వారిలో 72.3 శాతం మంది భారతీయులే. ఈ విషయాన్ని స్వయంగా అమెరికా సిటిజెన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్ సీఐఎస్) విభాగం వెల్లడించింది. ఇటీవలే రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో భారత విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఆ విషయాన్ని తెలియజేశారు.

# భక్షకుడైన రక్షక భటుడు

**ఫిర్యాదు ఇవ్వడానికి వచ్చిన యువతిపై కానిస్టేబుల్ అత్యాచారం**

**కటకటాల వెనక్కు పంపిన అధికారులు**

**కానిస్టేబుల్ స్నేహితుడితో పాటు భార్యపై కూడా కేసు నమోదు**

**మహా :** న్యాయం చేయాలంటూ పోలీసుస్టేషన్ కు వచ్చిన ఓ యువతిని మాయ మాచలతో లోబరచుకుని పలు మార్లు అత్యాచారానికి పాల్పడ్డ ఓ కానిస్టేబుల్ ను పోలీసులు కటకటాల వెనక్కు పంపించారు. ఓ విషయమై ఫిర్యాదు చేయడానికి స్టేషన్‌కు వచ్చిన యువతిని మాయమాటలతో నమ్మించి ఆమెను లొంగదీసుకున్నాడు. ఈ క్రమంలోనే ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ దారుణం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ దారుణానికి పాల్పడ్డ కానిస్టేబుల్ కి అంతకు ముందే వివాహం జరగడం ఒక ట్విస్ట్ అయితే చివరికి తన భార్యతో కలిసి బాధిత యువతిపై దాడి చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. 31 ఏళ్లు ఉన్న బాధిత యువతి ఓ కేసులో డబ్బులు వచ్చేలా చూడాలని మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చింది. అక్కడ ఉన్న సుధాకర్‌రెడ్డి అనే కానిస్టేబుల్ ఆమెతో మాటలు కలిపాడు. ఆ మహిళతో పరిచయం పెంచుకుని న్యాయం చేస్తానని హామీ ఇచ్చాడు. అనంతరం ఆమెను తన ఇంటికి రప్పించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబరుచుకుని అత్యాచారానికి పాల్పడ్డాడు.

ఈ క్రమంలోనే పెళ్లి విషయం మాట్లాడుదామని, తన అమ్మానాన్నలకు పరిచయం చేస్తానని భార్యలేని సమయంలో ఇంటికి రప్పించి అత్యాచారం చేశాడు. ప్రతిసారి ఏదో ఒకలా ఆమెకు మాయమాటలు చెప్పి తన లైంగిక వాంఛలను తీర్చుకుంటూ పలుసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. చివరకు బాధితురాలు





గర్భం దాల్చడంతో తన నిజస్వరూపం బయటపెట్టాడు. అప్పటికే తనకు పెళ్లి జరిగిందని అబార్షన్ చేయించుకోమని సలహా ఇచ్చాడు. అంతే కాకుండా అబార్షన్‌కు ఒత్తిడి చేసి ఆమెతో బలవంతంగా టాబ్లెట్లు మింగించాడు. మరోసారి యువతి ఇంటికి వెళ్లి బలవంతంగా ఫినాయిల్ తాగించాడు. ఆ తర్వాత మరోసారి ఆమెను ఇంటికి పిలిపించుకుని దాడి చేశాడు. అంతటితో ఆగకుండా తన భార్య సింధూజ, స్నేహితుడి కళ్యాణ్ గౌడ్‌లతో కలిసి ఆమెపై దాడి చేయించాడు. చివరికి తనకు జరిగిన అన్యాయంపై బాధితురాలు ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో కానిస్టేబుల్ బాగోతం వెలుగులోకి వచ్చింది. ఇక ప్రస్తుతం సీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌రెడ్డిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు వెల్లడించారు. అలానే సుధాకర్‌రెడ్డి భార్య సింధూజ, స్నేహితుడు కళ్యాణ్ గౌడ్‌లపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

# ఓవరాక్షన్ చేయవద్దు

**అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజగోపాల్ నగర్‌లో పర్యటించిన రంగనాథ్**

**బాధితుల సమస్యలు వింటుండగా జోక్యం చేసుకున్న హైకోర్టు న్యాయవాది ముఖీం**

**మీరు ఓవరాక్షన్ చేయవద్దని హైడ్రా కమిషనర్ హెచ్చరిక**

**పటాన్ చెరు, మహా:** ప్లాట్ల విషయంలో కొనుగోలుదారులను కొందరు భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నట్లుగా ఉందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. రెండు వారాల్లో లోతుగా పరిశీలించి ఇరువర్గాలు చెప్పింది. వింటామని, అదే సమయంలో కోర్టు పరిధిలో ఉన్న అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని రెండు నెలల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు రంగనాథ్ శుక్రవారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐలాపూర్‌లో గల రాజగోపాల్ నగర్‌లో పర్యటించారు. తమ ప్లాట్లను కొంతమంది కబ్జా చేస్తున్నారంటూ రాజగోపాల్ నగర్ ప్లాట్స్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదుతో ఆయన పర్యటించారు. ఈ నేపథ్యంలో ఐలాపూర్‌లో పర్యటించిన రంగనాథ్ బాధితుల సమస్యలను విన్నారు.

**ఇరువురి మధ్య వాదన**

రాజగోపాల్ నగర్ అసోసియేషన్ సభ్యులతో



హైడ్రా కమిషనర్ రంగనాథ్ సమావేశమయ్యారు. రంగనాథ్ బాధితుల సమస్యలు వింటున్న సమయంలో హైకోర్టు న్యాయవాది ముఖీం జోక్యం చేసుకున్నారు. న్యాయవాది ముఖీం, 'మీకు తెలుగు వచ్చా' అని హైడ్రా కమిషనర్‌ను అడిగారు. కోర్టు పరిధిలో ఉన్న దానిని చూసేందుకు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఓవర్ యాక్షన్ చేయవద్దని న్యాయవాదిని రంగనాథ్ హెచ్చరించారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ అయింది.

**వారిని ముందు పెట్టి కబ్జా చేశారనే ఆరోపణ: రంగనాథ్**

రాజగోపాల్ నగర్‌లో 40 ఏళ్ల క్రితం ప్లాట్లు కొనుగోలు చేశామని, కానీ కొంతమంది వచ్చి ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని బాధితులు ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేశారని రంగనాథ్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీలను ముందు పెట్టి ముఖీం అనే న్యాయవాది దీనిని కబ్జా చేసినట్లుగా ఆరోపణలు వచ్చాయన్నారు. కానీ 1980లలో ప్లాట్లు కొన్న వారిలో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీలు, పేదవారు ఉన్నారని రంగనాథ్ వెల్లడించారు. కరోనా సమయంలో తాము కట్టుకున్న ఇళ్లను కూలగొట్టారని బాధితులు ఆరోపించారని తెలిపారు. ఈ అంశానికి సంబంధించి వాస్తవాలు తెలుసుకోవడానికి తాము ఇక్కడకు వచ్చామన్నారు.

## ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు పరిశ్రమలు

**రాష్ట్రంలో డ్రోన్ టెక్నాలజీ విస్తరణ**
**మంత్రి శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంలో డ్రోన్ టెక్నాలజీ విస్తరణకు పలు సంస్థలు ముందుకొచ్చాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ఏడాది నూతనంగా 500 ఉద్యోగాలు ఇవ్వనున్నట్లుగా ఆయన వెల్లడించారు. సెంటిలియాన్, హెచ్‌పీ రోబోటిక్స్ సంస్థల ప్రతినిధులు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో శ్రీధర్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన, పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి నమ్మకం కలిగించే విధంగా పారిశ్రామిక విధానాలు రూపొందిస్తున్నట్లుగా తెలిపారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకూ పరిశ్రమలను విస్తరించాల్సిన అవసరం ఉందని శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు.

# పురుషాంగం పునఃసృష్టి

- వైద్య రంగంలో భాగ్యనగర డాక్టర్ల అద్భుతం
- సున్తీతో ఇన్ ఫెక్షన్, పురుషాంగాన్ని కోల్పోయిన యువకుడు
- అరుదైన శస్త్ర చికిత్సతో కొత్త జీవతం

**మహా :** హైదరాబాద్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స సక్సెస్ ఫుల్ గా నిర్వహించి అద్భుతం చేశారు. చిన్నప్పుడు సున్తీ చేయడం వల్ల ఓ యువకుడికి ఇన్ఫెక్షన్ సోకింది. దీంతో అతను పూర్తిగా పురుషాంగాన్ని కోల్పోయాడు. వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి కోల్పోయిన పురుషాంగాన్ని పునరుద్ధరించి ఇప్పుడు అతనికి కొత్త జీవితం ఇవ్వడం హాట్ టాపిక్ గా మారింది. తొడ, పొట్ట ప్రాంతంలోని రక్తనాళాలు అలాగే మోచేతి నుంచి కండరాన్ని సేకరించి పురుషాంగాన్ని రూపొందించారు. ఆ తర్వాత దాన్ని విజయవంతంగా శస్త్రచికిత్స చేసి అమర్చారు. అయితే ఈ శస్త్రచికిత్సను ఏడాదిన్నర క్రితం చేశారు. ఇప్పుడు అంగస్తంభన కోసం పినైల్ ఇంప్లాంట్ ఏర్పాటు చేయడంతో యువకుడు పూర్తిగా కోలుకున్నట్టు వైద్యులు ప్రకటించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సోమాలియాకు చెందిన 20 ఏళ్ల యువకుడికి నాలుగేళ్ల వయసులో సున్తీ జరిగిందని అన్నారు. ఆ సమయంలో ఇన్‌ఫెక్షన్ సోకడంతో అతడికి పురుషాంగాన్ని తొలగించి, వృషణాల కింద నుంచి మూత్రం వెళ్లేలా మార్గం ఏర్పాటుచేశారు. కానీ అతడికి 18 ఏళ్లు వచ్చే నాటికి మూత్ర విసర్జనలో ఇబ్బందులు తలెత్తడంతో బాధితుడు మాదాపూర్ లోని మెడికవర్ ఆసుపత్రిని సంప్రదించాడు. దీంతో అక్కడి వైద్యులు తొలుత మూత్ర విసర్జన సాఫీగా జరిగేలా సర్జరీ చేసి ఉపశమనం కలిగించారు. ఆసుపత్రికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ రవికుమార్, ప్లాస్టిక్ సర్జరీ డాక్టర్ దాసరి మధు వినయ్ కుమార్‌లు ఈ ఆపరేషన్ ని డీల్ చేసినట్టు తెలుస్తోంది. ఆ తర్వాత పురుషాంగాన్ని పునఃసృష్టించి అతడికి అమర్చాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మైక్రో వాస్క్యులర్ సర్జరీ ద్వారా రేడియల్ ఆర్టెరీ ఫోర్‌ఆర్మ్ ఫ్లాప్ విధానంలో తొలుత యువకుడి పురుషాంగాన్ని రూపొందించారు. తమ ప్రయోగం ఫలించడంతో ఏడాదిన్నర కిందట శస్త్రచికిత్స ద్వారా వృషణాల పైభాగంలో దానిని అతికించారు. పురుషాంగం నుంచి మూత్ర విసర్జన జరిగేలా గొట్టాన్ని అమర్చి మూత్రాశయానికి అనుసంధానం చేశారు. ఏడాదిన్నర కిందట జరిగిన శస్త్రచికిత్స విజయవంతమై బాధితుడు స్పర్శ పొందడంతో అంగస్తంభన కోసం తాజాగా పినైల్ ఇంప్లాంట్‌ను అమర్చినట్టు వైద్యులు వివరించారు. ఇప్పుడు యువకుడు పెళ్లి చేసుకుని కొత్త జీవితం గడపవచ్చని భరోసా ఇచ్చారు. అయితే గతంలో ఇన్‌ఫెక్షన్ కారణంగా వీర్య గ్రంథి దెబ్బతినడం వల్ల వీర్యం ఉత్పత్తి జరగదని వెల్లడించారు.

## జమ్మూకశ్మీర్ లో ఏడుగురు పాక్ చొరబాటుదారుల హతం

- కశ్మీర్ లో భారత భద్రతా బలగాలకు విజయం
- చొరబాట్లకు యత్నించిన పాకిస్థాన్ ఉగ్రవాదులు
- పాక్ ప్రయత్నాన్ని దీటుగా తిప్పికొట్టిన భారత సైన్యం

**మహా:** జమ్మూకశ్మీర్ లో భారత భద్రతా బలగాలకు భారీ విజయం చేకూరింది. సరిహద్దులో చొరబాట్లకు పాల్పడుతున్న ఏడుగురు పాకిస్థాన్ జాతీయులను భారత సైన్యం మట్టుబెట్టింది. వారిలో ఇద్దరు ముగ్గురు పాక్ సైనికులు ఉండొచ్చని సైన్యం భావిస్తోంది. ఫిబ్రవరి 5వ తేదీని పాక్ కశ్మీర్ సంఘీభావ దినంగా పాటిస్తోంది. ఈ సందర్భంగా భారత్ లో చొరబడేందుకు పాక్ ఉగ్రవాదులు ప్రయత్నించారు. జమ్మూకశ్మీర్ లోని పూంచ్ సెక్టార్ లో కృష్ణాఘాటి వద్ద టెర్రరిస్టుల చొరబాటు యత్నాన్ని భారత జవాన్లు భగ్నం చేశారు. ఉగ్రవాదులు చొరబడేందుకు వీలుగా భారత సైన్యం దృష్టి మరల్చేందుకు పాక్ బోర్డర్ యాక్షన్ టీమ్ (బీఏటీ) కాల్పులకు తెగబడింది. ఓ భారత సైనిక పోస్టుపై కాల్పులు జరిపింది. ఈ కాల్పులను భారత సైన్యం దీటుగా తిప్పికొట్టింది. ఈ ఘటనలోనే ఏడుగురు పాకిస్థానీలు హతమయ్యారు. మృతుల్లో పలువురు అల్ బదర్ ఉగ్రవాద గ్రూపుకు చెందిన వారు ఉన్నట్టు భావిస్తున్నారు.

# దళితుల తలరాత మార్చిన రేవంత్

**ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మకం**

- గ్రూపులోని అన్ని కులాలకు రిజర్వేషన్లు
- ఎస్సీ వర్గీకరణ ద్వారా ఎవరికి అన్యాయం జరగదు
- ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్

**హైదరాబాద్, మహా:** పదేళ్ల బీఆర్‌ఎస్‌పాలనలో మాజీ సీఎం కేసీఆర్, ప్రధానీ నరేంద్ర మోదీ రిజర్వేషన్ల విషయంలో డ్రామాలు చేశారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ విమర్శించారు. గాంధీ భవన్‌లో శుక్రవారం ఎస్సీ వర్గకరణ విషయంలో నెలకొన్న అనుమానాల నివృత్తిపై సంపత్ కుమార్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్సీ వర్గీకరణతో ఎవరికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణ మూడు గ్రూపులుగా విభజించినా.. గ్రూప్‌లోని అన్ని కులాలకు రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపారు. ఈ విషయంలో మాదిగ నేత మందకృష్ణతోపాటు మరికొందరు కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వారివారి అనుమానాల నివృత్తి కోసమే ప్రజెంటేషన్‌ద్వారా మీడియా ముందుకు వచ్చామన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం





2011 జనాభా లెక్కల ప్రకారం తీసుకున్నామని, ఈ లెక్కలు ప్రభుత్వ అధికారిక లెక్కలు అని ఆయన స్పష్టం చేశారు. మాలలతో పోల్చితే మాదిగల జనాభా డబుల్ ఉందని, 11శాతం ఇవ్వకుండా..9 శాతం రిజర్వేషన్ ఎందుకు కేటాయించారు అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. 59 ఎస్సీ కులాలను ABCD గా వర్గీకరించారని, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉషా మెహర్ కమిటీ వేసిందని పేర్కొన్నారు. ఆ తర్వాత తెలంగాణ ఉద్యమం ఉధృతం కావడం.. కేంద్రంలోని బీజేపీ, బీఆర్‌ఎస్‌లు వర్గీకరణను అడ్డుకున్నాయని విమర్శించారు.

**సుప్రీం కోర్టులో బలమైన వాదనలు**

కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి వచ్చాక.. సుప్రీం కోర్టులో బలమైన వాదనలు వినిపించడం జరిగిందన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు.. ఏకసభ కమిషన్ వేసి నివేదిక ఆధారంగా మూడు గ్రూపులు చేసింది ప్రభుత్వమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తో విడిపోయాక కొన్ని కులాలు తెలంగాణ లో లేవని, మూడు గ్రూపులుగా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దానిలో భాగంగానే గ్రూప్ 1 కి 1శాతం.. గ్రూప్2 కి 9శాతం.. గ్రూప్ 3 కి 5 శాతం.. రిజర్వేషన్ కేటాయించడం జరిగిందన్నారు. అయితే, గ్రూప్-1 లో 15 కులాలు, గ్రూప్-2 లో 18 కులాలు, గ్రూప్-3 లో 26 కులాలు ఉండగా 33.96 శాతం మాత్రానే ఎస్సీ జనాభాలో ఉన్నారని చెప్పారు. ఏ ఒక్క కులానికి ఇచ్చిన రిజర్వేషన్ కాదని, ఆ గ్రూప్ లోని అన్ని కులాలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. 5శాతం రిజర్వేషన్ ఇచ్చింది మాలలకు ఒక్కరికే కాదని, గ్రూప్ 3లో ని అన్ని కులాలకు ఇదీ వర్తిస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా ఎవరికి అన్యాయం జరగదు అని పేర్కొన్నారు.

మహా పత్రిక
తెలుగు
శనివారం, హైదరాబాద్ | 08-02-2025





# చిన్నారుల ఆకలి తీర్చేందుకు..

చిన్నారుల ఆకలికి వ్యతిరేకంగా పోరాడుతున్న స్వచ్ఛంద సంస్థ కోసం నిధులు సేకరించేందుకు ఇంగ్లీష్ ఛానెల్ని ఈదింది 16 ఏళ్ల భార త సంతతి విద్యార్థి ప్రిషా తాప్రే. ఈ ఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కురాలిగా చరిత్ర సృష్టించింది. ఉత్తర లండన్ బుషే మీడ్స్ స్కూల్లో చదువుతున్న ప్రిషా తాప్రే 12 ఏళ్ల వయసులో ఈ ఇంగ్లీష్ ఛానెల్ గురించి తెలుసుకుని ఈదాలనే ఆసక్తిని పెంచుకున్నట్లు తెలిపింది. అందుకోసం నాలుగేళ్ల కఠిన శిక్షణ అనంతరం ప్రిషా ఇంగ్లాండ్‌లోని డోవర్ తీరం నుంచి ఫ్రాన్స్‌లోని క్యాప్ గ్రిసెనెజ్ వరకు దాదాపు 34 కిలోమీటర్ల ఈతని 11 గంటల 48 నిమిషాల్లో పూర్తి చేసింది. ప్రిషా ఈ లక్ష్యాన్ని సోలోగా పూర్తి చేయడం విశేషం. ప్రిషా యూకేలోనే జన్మించగా, ఆమె తల్లిదండ్రులు మహా- రాష్ట్రాకు చెందినవారు.



# నాట్యంలో మేటి... నటనలో సాటి

శాస్త్రీయ నృత్యకళను కాపాడేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నారు హైదరాబాద్ నగరానికి చెందిన పీబీ కృష్ణభారతి. హైదరాబాద్ మల్లాపూర్‌కు చెందిన ఈమె కూచి పూడి నృత్యంలో శిక్షణ ఇస్తూ ప్రాచీన కళను భవిష్యత్ తరాలకు అందిస్తున్నారు. సాంస్కృతిక రంగంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తొలి గౌరవ పురస్కారానికి ఎంపి కయ్యారు.

### తల్లిదండ్రులే ఆదర్శం

తల్లిదండ్రులను ఆదర్శంగా తీసుకున్న కృష్ణభారతి ఆరేళ్ల ప్రాయంలోనే కూచిపూడి నృత్యం నేర్చుకునేందుకు నడుంబిగించారు. నాలుగేళ్లలో నాట్యంలో చక్కటి ప్రావీణ్యం సాధించి తనని తాను నిరూపించుకునే ప్రదర్శనలు ఇచ్చారు. ప్రతి వేదికపై విమర్శకుల ప్రశం సలు అందుకున్నారు. హైదరాబా ద్ విశ్వవిద్యాలయం నుంచి నృత్యంలో మాస్టర్స్ డిగ్రీ పొందారు. వివిధ ఉత్సవాల్లో పద్మశ్రీ కే.శోభానాయు డు, అనురాధ జొన్నలగడ్డ బృందాలతో కలిసి పాల్గొ న్నారు. నాట్య గురువుగా ప్రస్తుతం వందల మందికి శిక్షణనిస్తున్నారు. హైదరా బాద్, హబ్సిగూడలోని పల్లవి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆర్ట్స్ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు.

### కళాకారుల కుటుంబం నుంచి..

ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో కళాకారుల కుటుంబంలో కృష్ణ భారతి పుట్టారు. తండ్రి ఎస్కే తిరుమలాచారి (వయోలిన్ విద్వాంసుడు). తల్లి ఎస్కే విజయలక్ష్మి (వీణా, గాయని). కృష్ణభారతి కుటుంబంలో అన్న, తమ్ముడు, చెల్లి అందరూ కళాకారులే. ఆయా రంగాల్లో నిష్ణాతులు. తన ఆరో ఏట నుంచే ఏలూరులో వేదాంతం ప్రహ్లాద శర్మ వద్ద కూచిపూడి నృత్యం ఆభ్యసించారు. 1973 వరకూ ఏలూరులోనే ఉండి ఆ తర్వాత హైదరాబాద్, మల్లాపూర్లో స్థిరపడ్డారు. 1978లో దివంగత కూచిపూడి నృత్యచూడామణి పద్మశ్రీ డాక్టర్ శోభానాయుడు వద్ద శిష్యురాలిగా చేరారు. సంస్కృతి రత్న, నాట్యశ్రీ. ఉగాది పురస్కారం, ఎన్టీఆర్ పుస్కారం, నాట్య విశారద వంటి అవార్డులు, బిరుదులను కృష్ణభారతి అందుకున్నారు.



# అన్నింటా రాణింపు అవనిలో మేళవింపు

ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు ప్రపంచానికే స్ఫూర్తిగా నిలుస్తున్నారు. అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. క్రీడాకారులుగా, నృత్యకళలో, ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా, ప్రజాప్రతినిధులుగా తమ సత్తాచాటుతున్నారు. తాను అబల కాదు.. సబల, సాహసి అని నిరూపిస్తున్నారు. పిరికి తనం వదిలి పిడికిలి బిగిస్తున్నారు. నింగికి నిచ్చెన వేస్తున్నారు. ఆకాశంలో సగమై, అవనిలో అర్ధభాగమై నడుస్తున్నారు. జగతిలో తాను లేని చోటు లేదని రుజువు చేస్తున్నారు. వారి పట్టుదలకు, శక్తిసామర్థ్యాలకు, కార్యదీక్షకు యావత్ ప్రపంచం జేజేలు పలుకుతోంది. - మహా, ప్రత్యేకం

# 45 ఏళ్ల వయస్సులోనూ స్విమ్మర్‌గా..

జీవితంలో ఎదురైన ప్రతిబంధకాల నుంచి బయటపడేందుకు ఏదో ఒకటి సాధించాలనే తపనతో ముందుకు సాగుతారు. ఆ కోవకు చెందిన వారే స్విమ్మర్ గోలి శ్యామల. సామర్లకోటకు చెందిన శ్యామల భర్త మోహన్ ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగి. కుమారుడితో కలిసి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో యానిమేషన్ స్టూడియో పెట్టుకుని పలు సీరియళ్లు, సినిమాలకు పనిచేశారు. దురదృష్టవశాత్తూ స్టూడియో ద్వారా తీవ్రంగా నష్టపోవడంతో మానసికంగా మనోవేద నకు గురయ్యారు. దాంతో ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. 45 ఏళ్ళ వయసులో శరీరం సహకరించని స్థితిలో మనసును మళ్ళించేందుకు హైదరాబాద్‌లో స్విమ్మింగ్ నేర్చుకున్నారు. స్వతహాగా ఆమె స్విమ్మర్ కాదు.. అయినా సత్తా చాటారు. ఐదు పదుల వయసులో ఆమెను సముద్రాలు దాటే సాహస యాత్రికురాలిగా మారింది.

### 150 కిలోమీటర్లు ఏడు రోజుల్లో అలవోకగా..

గత డిసెంబరు 28న విశాఖలోని ఆర్కే బీచ్ వద్ద సముద్ర తీరంలో ఈత ప్రారంభించిన శ్యామల ఏడు రోజుల్లో కాకినాడ తీరం చేరుకున్నారు. యానిమేషన్ స్టూడియోలో నష్టం రావడంతో డిప్రెషన్లోకి వెళ్ళిపోయిన తాను మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు స్విమ్మింగ్ ప్రారంభించాననీ, కోచ్ జాన్సిద్ధిక్ సహ కారంతో జీరో లెవెల్ నుంచి 150 కిలోమీటర్ల స్విమ్ చేసేలా తయారయ్యానని సగర్వంగా చెప్పారు. 2021లో శ్రీలంక నుంచి ఇండియా వరకు రామ్‌సేతు దాటానని, తాజాగా ఫిబ్రవరిలో లక్షద్వీప్‌లో స్విమ్ చేశాన న్నారు. బంగాళాఖాతంలో 150 కిలోమీటర్లు ఈదడం ద్వారా ఆసియా స్థాయిలో ఘనత సాధించానన్నారు. విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు ఈదాలని రెండేళ్ళ కిందటే నిర్ణయించుకున్నానని, అయితే రెండుసార్లు వాతావరణం అనుకూలించలేదనీ, ఎట్టకేలకు నా కల నెరవేరిందన్నారు.



# అనమ్ మీర్జా.. సంపాదనలో దర్జా

భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా గురించి తెలిసిన చాలా మందికి ఈమె సోదరి 'అనమ్ మీర్జా' గురించి తెలిసి ఉండకపోవచ్చు. కానీ ఈమె 330 కోట్ల రూపాయల సామ్రాజ్యానికి అధినేత!.. ఆనం మీర్జా గురించి మరిన్ని వివరాలు తెలుసుకుందాం. సానియా మీర్జా మాదిరిగా కాకుండా భిన్నమైన మార్గాన్ని ఎంచుకుని వ్యాపార రంగంలో ముందుకు సాగుతున్న అనమ్ మీర్జా మాస్ కమ్యూనికేషన్ అండ్ మీడియా స్టడీస్ పూర్తి చేసి వివిధ జాతీయ ఛానెల్లలో ఇంటర్న్‌గా జర్నలిజంలో తన వృత్తిని ప్రారంభించింది.

ఉద్యోగం చేస్తున్న రోజుల్లోనే ఈమెకు సొంతంగా ఏదైనా ప్రారభించాలనే ఆకాంక్ష ఎక్కువగా ఉండేది. ఈ కారణంగానే 2013లో ఔత్సాహిక జర్నలిస్టుల కోసం 'ఇంక్ టు చేంజ్' అనే వెబ్ సైట్ ప్రారంభించింది. 2014 లో అక్బర్ రషీదితో వివాహం జరిగిన తరువాత ఆమె తన ఫ్యాషన్ లేబుల్ 'ది లేబుల్ బజార్'ని ప్రారంభించింది. 2022లో అనమ్ మీర్జా భారతదేశపు అతిపెద్ద రంజాన్ ఎక్స్‌పో, దావత్-ఎ-రంజాన్ స్థాపించింది.

అనమ్ మీర్జా వ్యాపారాలు మాత్రమే కాకుండా 1,25,000 కంటే ఎక్కువ మంది ఫాలోవర్లతో ఒక యూట్యూబ్ ఛానల్ ఉంది. దీని ద్వారా కూడా బాటుగా సంపాదిస్తోంది. వ్యాపార రంగంలో తనదైన రీతిలో దూసుకెళ్తున్న అనమ్ మీర్జా నికర విలువ 40 మిలియన్ డాలర్ల వరకు ఉంటుందని సమాచారం. అంటే భారతీయ కరెన్సీ ప్రకారం ఈమె ఆస్తుల విలువ రూ.331 కోట్లకంటే ఎక్కువ.



# క్రికెట్‌లో రైజింగ్ స్టార్

మహిళా క్రికెట్‌లో తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష సత్తాచాటారు. బ్యాటింగ్‌లో నిలకడ.. షాట్లలో కచ్చితత్వం, క్రీజులో నిలిస్తే చక్కని ఇన్నింగ్స్ ఆడగలిగే నేర్పరితనం.. ఆ అమ్మాయి సొంతం. మిథాలీ రాజ్ తర్వాత జాతీయ సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించే సత్తా తనలో ఉందని ఆటద్వారా చాటారు. ఇటీవల మలేసియాలో ముగిసిన ఆసియా అండర్-19 టోర్నీలో భారత జట్టు విజేతగా నిలిచేందుకు కీలకపాత్ర పోషించారు.

### నాన్నతో బెట్టు.. ఆటపై పట్టు

పట్టుదలకు మారుపేరుగా నిలుస్తున్న గొంగడి త్రిష తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలంలో జన్మించారు. ఆమె తండ్రి రామిరెడ్డికి ఆటలంటే ఎంతో ఇష్టం. ఐటీసీలో ఫిట్‌నెస్ సలహాదారుడిగా పని చేస్తుండేవారు. త్రిషకు చిన్నతనంలోనే క్రికెట్ అంటే ఇష్టం ఉందని గమనించి ఆ దిశగా ప్రోత్సహించారు. ఆమెకు మెరుగైన శిక్షణను ఇప్పించాలని చేస్తున్న పనిని, ఉన్న ఊరును విడిచి 2013లో హైదరాబాద్‌కు వచ్చేశారు. సెయింట్ జాన్స్ క్రికెట్ అకాడమీలో ఏడేళ్ల త్రిషను చేర్చాడు. అదే అకాడమీలో తన చిన్నప్పటి నుంచి దిగ్గజ ప్లేయర్ మిథాలీ రాజ్ ఆటను చూస్తూ వచ్చింది త్రిష. దీంతో ఆమెలాగే తాను పెద్ద క్రికెటర్‌ను కావాలనుకుంది. అప్పడప్పడూ మిథాలీ సలహాలు కూడా తీసుకునేది.

### రోజుకు ఏడెనిమిది గంటల ప్రాక్టీస్

నాన్న నమ్మకాన్ని నిలబెడుతూ త్రిష ఆటపై పట్టు సాధించింది. రోజుకు ఏడెనిమిది గంటల ప్రాక్టీస్ చేసేది. ఈ క్రమంలో 8 ఏళ్లకే అండర్-16, 12 ఏళ్లకే అండర్-19 టోర్నీలలో ఆడింది. 13 ఏళ్లకే బీసీసీఐ ఛాలెంజర్స్ టోర్నీ బరిలో దిగింది. కెరీర్‌లో ఆరంభంలో పేసర్‌గా ఉన్న త్రిష.. కోచ్ జాన్ మనోజ్ సూచన మేరకు లెగ్ స్పిన్‌కు మారింది. ఇక 2023లో అండర్ -19 ప్రపంచకప్ తొలి ఎడిషన్ లో పాల్గొంది. ఫైనల్‌లో 24 పరుగులతో భారత్ తొలి టైటిల్‌ను అందుకోవడంలో కీలక పాత్ర పోషించింది. ఇక రెండో సారి అండర్-19 ప్రపంచకప్‌లోనూ తన సత్తా ఏమిటో ప్రపంచానికి చూపించింది. టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలిచి భారత్ విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించింది. ప్రస్తుతం ఆమె ఆడుతున్న ఆటను చూస్తుంటే అతి త్వరలోనే భారత మహిళల సీనియర్ జట్టులోనే చోటు దక్కించుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. సీనియర్ క్రికెట్‌లో త్రిష మరెన్ని సంచనాలు సృష్టిస్తుందో చూడాల్సిందే.





## తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న కార్పొరేటర్ బన్నాల

**ఉప్పల్,మహా:** బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తన జన్మదినాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకోవడం జరిగింది. తన జన్మదినాన ఏడుకొండల వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలని శుక్రవారం తిరుమలకి రావడం జరిగిందని తెలుపుతూ ఆ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు కేసీఆర్ ,కేటీఆర్, బండారి లక్ష్మా రెడ్డి పై తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై ముఖ్యంగా ఉప్పల్ నియోజకవర్గం ప్రజల పై ఉండాలని కోరానని తెలిపారు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న బన్నాల కుటుంబ సభ్యులు కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ,సోదరి వాణి, వారి కుమారులు సాయిరామకృష్ణ సాయి అక్షయ్.

## చిలుకానగర్ ప్రాంతంలో ఫుట్ పాత్ లపై అధికారుల కొరడా

### ఆక్రమణలు తొలగిస్తుండగా పెట్రోల్ బాటిల్ తో మహిళ హల్చల్



**ఉప్పల్,మహా:** ఉప్పల్ జిహెచ్ఎంసి పరిధిలోని చిలుకానగర్ ప్రాంతంలో ఫుట్ పాత్ లపై అధికారుల కొరడా జులిపించారు, ఫుట్ ఫాత్ పై ఉన్నా ఆక్రమనలు తొలగిస్తున్న క్రమంలో బత్తిని రాధిక అనే మహిళా తన 20 ఏళ్లుగా నడిపిస్తున్నా పాలబూత్ ను అధికారులు అన్యాయంగా కూల్చివేస్తున్నారని పెట్రోల్ బాటిల్ తో సుసైడ్ చేసుకుంటనట్టూ హెచ్చరించింది, జిహెచ్ఎంసి వాహనాలకు,జెసిపికి అడ్డుగా కూర్చొని నిరసన తెలిపింది ,కళ్యాణపురి పార్క్ దగ్గర గత 20 సంవత్సరాల నుండి పాల బూతు నడిపిస్తున్నా,ట్రేడింగ్ లైసెన్స్ ఉంది, 18 సంవత్సరాల నుండి ప్రతి నెల కరెంట్ బిల్లు కడుతున్నా,నాకు ఇద్దరు పిల్లలు ,భర్త చనిపోయాడు ,పాల భూత్ మీదనే బ్రతుకుతున్నా, ఇక్కడనే నివాసం ఉంటున్నాను, కొందరు బిల్డర్లు షెటర్లు వేసుకోవాలని స్వార్ధంతో ఎన్నోసార్లు బెదిరించినా కూడా బెదరలేదు, ఈరోజు అధికారులు అన్యాయంగా నా పాలభూతును కూల్చివేశారు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నా పాలాభుత్ ను కుల్చివేయడమే కాకుండా పాల బూతులో ఉన్న ఫ్రిడ్జ్,పాలట్రేయ్ లు,ఇతర సామానులుతో జిహెచ్ఎంసి వాహనంలో వేశారు, నాకు న్యాయం జరగకపోతే పెట్రోల్ పోసుకొని చనిపోతానని జిహెచ్ఎంసి వాహనాలకు అడ్డుగా పెట్రోల్ డబ్బతో కూర్చొని నిరసన తెలియజేసింది. ప్రతిరోజు ఇల్లు ఇల్లు తిరిగి పాల ప్యాకెట్లు వేసుకుంట్టు జీవనం కొనసాగిస్తున్నా,నాకు జీవనోపాధి లేకుండా చేశారని నా జీవితాన్ని రోడ్డుపాలు చేశారని నాకు న్యాయం చేయాలని బాధితురాలు కన్నీటి పర్యంతమయ్యారు.

## నగరంలో భూగర్భ నీటి వనరుల స్థాయిని గుర్తించండి

### కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ అడిషనల్ సెక్రటరీ తారా





**వరంగల్, మహా:** గ్రేటర్ వరంగల్ నగరంలో భూగర్భ నీటి వనరుల స్థాయి గుర్తించాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ (ఏం ఓ హెచ్ యు ఏ) అడిషనల్ సెక్రటరీ తారా అన్నారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్ (ఏం ఓ హెచ్ యు ఏ) ఆధ్వర్యం లో ఢిల్లీ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే క్యాంప్ కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ సెక్రటరీ మాట్లాడుతూ గృహనిర్మాణ,పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఏం ఓ హెచ్ యు ఏ), కేంద్ర ప్రభుత్వ నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ ఆర్ ఎస్ సి)/ ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) సంయుక్త సహకారంతో దేశం లో 10 ఎంపిక చేసిన నగరాలైన విజయనగరం, భువనేశ్వర్ ఇటానగర్, బుర్ద్వాన్ కోర్బా, భోపాల్, వరంగల్, ఉన్నావ్, మైసూరు నాగ్‌పూర్ పట్టణాల్లో అమృత్ 2.0 కింద అక్విఫెర్ సస్టైనబిలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏ ఎస్ ఎం ఎస్) యొక్క మొదటి దశ ని ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందని, నగరం యొక్క ఆధారిత శాస్త్రీయ డేటాబేస్ చొరవ తో అమృత్ నగరాల్లోని పట్టణ, పెరిఅర్బన్ ప్రాంతాల కోసం అంతరిక్షఆధారిత శాస్త్రీయ డేటాబేస్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని. సమర్థవంతమైన ప్రణాళిక ద్వారా పట్టణ జలాశయాలను సమర్థవంతంగా నిర్వహించడానికి తగిన చర్యలను చేపట్టడం, అమలు చేయడం కోసం నిర్ణయాలు తీసుకోవాలని బల్దియా పబ్లిక్ హెల్త్ కు చెందిన ఇంజనీర్లు అర్బన్ ప్లానర్ల ద్వారా పోర్టల్ ను విస్తృతంగా ఉపయోగించి సమాచారాన్ని నమోదు చేయాలని మంత్రిత్వ శాఖ సూచించడం జరుగుతుందని అన్నారు. ఏం ఓ హెచ్ యు ఏ / ఎన్ ఆర్ ఎస్ సి లు ఎంపిక చేసిన 10 నగరాల కోసం కరపత్రాలను రూపొందించిందని ఇందుకోసం ఆయా నగరాల్లో వెంటనే అవసరమయ్యే భూగర్భ రీఛార్జ్ పాయింట్‌లను గుర్తించాలని, ఇందుకు సంబంధించిన మ్యాప్‌లను సిద్ధం చేసుకోవాలని, త్వరలో అమృత్ 2.0 యొక్క షాలో అక్విఫర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ కింద గ్రౌండ్ బ్రేకింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ లు రవికుమార్ సంతోష్ బాబు డి ఈ లు రంగా రావు రాజ్ కుమార్ కార్తీక్ రెడ్డి పబ్లిక్ హెల్త్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సక్కర్ తో ట్రంక్ లైన్ క్లీనింగ్ పనులు

### రూ.8 కోట్లతో జరుగుతున్న పనులు పరిశీలించిన సిజీఎం సుజాత కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, మహా:** ఉప్పల్ సర్కిల్ లో జరుగుతున్న ట్రంక్ లైన్ క్లీనింగ్ పనులను మెట్రో వాటర్ వర్క్స సిజిఎం సుజాత ,ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. రామంతాపూర్ కాలనీల నుంచి ఉప్పల్ నల్ల చెరువు సమీపంలోని ఎస్టీపీకి వచ్చే ట్రంక్ లైన్ ను క్లీనింగ్ చేయకపోవడంతో ఇక్కడి కాలనీవాసులకు శాపంగా మారింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఈ ట్రంకు లైన్ క్లీనింగ్ కోసం రూ. 8 కోట్ల నిధులను మంజూరు చేయించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ ట్రంకు లైన్లో సూపర్ సక్కర్ అనే మిషన్ తో క్లీన్ చేస్తున్నారు. వాటర్ వర్క్స ఎండి అశోక్ రెడ్డి సూచన మేరకు సిజియం సుజాత శుక్రవారం ఉప్పల్లో సర్కిల్లో జరుగుతున్న ట్రంక్ లైన్ క్లీనింగ్ పనులను కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి,ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. ఉప్పల్ సర్కిల్ లో పనులు వేగంగా జరుగుతున్నాయని ఈ సందర్భంగా సుజాత తెలిపారు. ఇదే తరహాలో నగరంలో మిగతా ప్రాంతాల్లోనూ పనులను చేపట్టనున్నట్టుగా చెప్పారు. కార్యక్రమంలో జిఎం సంతోష్. డీజీఎం రజినీకాంత్ రెడ్డి. పాసాల లూకాస్ ,నాగేశ్వరరావు ,సల్ల ప్రభాకర్ రెడ్డి,మధుబాబు ,సందీప్ ,భాస్కర్ ,సురేందర్ రెడ్డి బ్రహ్మచారి ,సుధాకర్, అశోక్ గౌడ్, నారాయణ శేఖర్ మేస్త్రి శంకరయ్య రమణారెడ్డి విజయ్ అచ్చిరెడ్డి యాదగిరి మీసాల రాములు పాల్గొన్నారు

## లక్నవరం రూట్ లో కారు బీభత్సం

- బుస్సాపూర్లో అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన కారు
- వృద్ధుడి మృతి
- నలుగురిని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్బంధించిన గ్రామస్తులు
- నచ్చజెప్పి పోలీస్ స్టేషన్ కు తరలించిన అధికారులు



**ములుగు, మహా :** విహారయాత్రకు వచ్చిన ఒక కుటుంబం ప్రయాణిస్తున్న కారు ఆదుపు తప్పడంతో ఇంట్లోకి దూసుకెళ్లి వృద్ధుడు మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మంచిర్యాల జిల్లాకు చెందిన ముగ్గురు మహిళలు ఇద్దరు పురుషులు తమ కారులో ప్రముఖ పర్యాటక కేంద్రమైన లక్నవరం సందర్శనకు వచ్చారు. గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ గ్రామానికి చేరుకోగానే కారు ఒకసారిగా అదుపుతప్పి పక్కనే ఉన్న ఇంట్లోకి దూసుకెళ్లింది. ఇంటిముందు కట్టెలు కొడుతున్న కట్ట నర్సిరెడ్డి (55) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న వారిని గ్రామస్తులు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో బంధించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కార్ లో ఉన్న వారిని పస్ర పోలీస్ స్టేషన్కు తరలించారు. అందులో మహిళకు గుండెనొప్పి వస్తుందని తెలుపగా వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. నర్సిరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా ఆసుపత్రి కి తరలించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పర్యాటక ప్రాంతమైన లక్నవరం వచ్చే టూరిస్టులు జాగ్రత్తలు పాటించాలని పసరా ఎస్సై కమలాకర్ సూచించారు.



## సివిల్ పనులను వెంటనే పూర్తి చేయండి

### బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే

**వరంగల్,మహా:** సివిల్ సంబంధిత పనులను వెంటనే పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. వరంగల్ తూర్పు పరిధిలో గల మెట్ల బావి వద్ద కొనసాగుతున్న పనులను కమిషనర్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా అధికారులు పనుల నిర్వహణ తీరును వివరిస్తూ నిర్దేశిత సివిల్ పనులను పూర్తి చేయడం జరిగిందని కేవలం గ్రిల్ ల ఏర్పాటు పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని వాటిని కూడా త్వరలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ బావి ప్రాంతం లో పచ్చదనం పెంపొందించడానికి గ్రీనరీ పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ రాజ్ మార్ ఏఈ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఇరుకు వీధుల్లో బడా భవనాలకు అనుమతులు ఎలా..?

- అనుమతులు ఒకలా నిర్మాణాలు మరోలా
- నిబంధనలకు విరుద్ధంగా బడా భవన నిర్మాణాలు
- పైసలు,పరపతి ఉంటే చాలు నిబంధనలు బేఖాతర్
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది



**వరంగల్, మహా:** గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులు నివాస గృహాలు, వాణిజ్య భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి వదిలేస్తున్నారు. పర్మిషన్ పొందిన భవన నిర్మాణదారుడు అనుమతులకు విరుద్ధంగా సెల్లార్లు, అదనపు అంతస్తులతో చెలరేగిపోతున్నా అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఫిర్యాదు చేస్తే కేవలం నోటీసులతో సరిపెడుతున్నారే తప్ప.. చర్యలు తీసుకోవడం లేదు. ఇదే సమయంలో షోకాజ్ నోటీసులు అందుకున్న నిర్మాణదారుడు.. డబ్బులిస్తే చాలు అధికారులు అతడి జోలికి వెళ్లరు. అదేమని అడిగితే సరైన ఎన్ఫోర్స్ మెంట్ లేదని స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు.

**నిబంధనలు బేఖాతర్..**

వరంగల్ మున్సిపాలిటీలో ఒకటి లేదా రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని స్థానిక కార్పొరేటర్లతో కుమ్మక్కయి టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బందికి కాసుల వర్షం కురిపించి వారి ఇష్టానుసారం మూడు, నాలుగు, లేదా ఐదు ఫ్లోరును నిర్మిస్తున్నారు. అనుమతి లేకున్నా పెంట్ హౌస్ నిర్మాణాలు చేపడుతున్నారు. నగరంలో ఓ సర్వే నంబర్ లో పర్మిషన్స్ తీసుకొని మరోచోట నిర్మాణాలు చేపడుతున్నారు. బడా భవనాల నిర్మాణాల్లో సెల్లార్, సెట్ బ్యాక్ ఎక్కడా వదలడం లేదు. ఇంటి నిర్మాణం పేరుతో పర్మిషన్స్ తీసుకొని కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నా పట్టించుకునే నాధుడే లేడు. మరోవైపు కొందరు ప్రభుత్వ స్థలాలు, నాలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.

**టౌన్ ప్లానింగ్ లో ఇష్టారాజ్యం..**

టౌన్ ప్లానింగ్ విభాగంలో కాసులిస్తే ఎవరికైనా పర్మిషన్ ఇస్తారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విభాగంలో పని చేసే ఉద్యోగులు ఎవరైనా పర్మిషన్స్ కోసం వస్తే చాలు అడిగినంత చేతిలో పెడితే పని అయిపోవాల్సిందే. ఎలాంటి రూల్స్ లేకున్నా నిర్మాణాలను అడ్డుకోరనే ఆరోపణలు చాలా ఉన్నాయి. ఫిర్యాదులు చేసినా టాస్క్ ఫోర్స్ పేరు చెబుతూ ఆఫీసర్లను పక్కదారి పట్టిస్తున్నారు. ముఖ్యంగా వరంగల్ మున్సిపాలిటీలో 12..13..22..25..27..28..4.. డివిజన్లలో అనుమతులు ఒకలా నిర్మాణాలు మరోలా బడా భవనాల తో పాటు కొన్నిచోట్ల జీ+2 పర్మిషన్ తీసుకొని ఏకంగా అపార్ట్ మెంట్ నిర్మిస్తున్నారు. అంతేకాకుండా బిల్డింగ్ ఎదురుగా లేదా పక్కనే నాలా ఉన్నదానిపై ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా భవనం నిర్మిస్తున్నారు. కమర్షియల్ వాణిజ్య భవనాలు , ఇంటి పర్మిషన్ కోసం కొంతమంది స్థానిక నాయకుల నుండి టౌన్ ప్లానింగ్ అధికారుల వరకు లక్షల్లో ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. 22వ డివిజన్ లోని రిలయన్స్ ఫ్రెష్ ఎదురుగా ఓ ప్రజా ప్రతినిధి బంధువు అనుమతులు ఒకలా నిర్మాణం మరోలా ఉంది. సెట్ బ్యాక్ లేకుండా మున్సిపాలిటీ డ్రైనేజీ కాల్వను తొలగించి మరల నిర్మాణం చేస్తున్న పట్టించుకునే నాధుడే లేడు. పర్మిషన్ తీసుకొని ఏకంగా మూడు ఫ్లోర్లను నిర్మిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు చేస్తే తాత్కాలికంగా పనులను నిలిపివేయగా వారం రోజుల తర్వాత యథావిధిగా నిర్మాణ పనులను ప్రారంభించారు.

**మొదట్లో గుర్తించట్లే..**

ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్లు మొదట్లోనే అక్రమ నిర్మాణాలను గుర్తిస్తే కూల్చివేతల వరకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. రహదారి విస్తీర్ణం, భవనం స్థాయి ఆధారంగా సెట్ బ్యాక్ లు, పార్కింగ్ స్థలం కేటాయిస్తున్నారా.. లేదా అనే వాటిని నిర్మాణ దశలోనే గుర్తించాలి. ఫుట్ పాత్, ప్రభుత్వ స్థలాలు, కాల్వలు, శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు అందిన వెంటనే అడ్డుకోవాలి. బిల్డింగ్ పర్మిషన్ ప్రకారం నిర్మాణాలు చేస్తున్నారా.. లేదా అని క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. పార్కులకు కేటాయించిన స్థలాలను వాటికే ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలి. ఇలా చేస్తే అక్రమ నిర్మాణాలను అరికట్టే అవకాశం ఉంటుందని ప్రజలు కోరుతున్నారు. బల్దియా పరిధిలో అక్రమ నిర్మాణాలను పరిశీలించి వాటిపై చర్యలు తీసుకుంటాం. ఇటీవల ప్రభుత్వ పార్కు స్థలంలో ఇచ్చిన ఇంటి నిర్మాణ పర్మిషన్ రద్దు చేసి చేపట్టిన నిర్మాణాన్ని కూల్చివేశాం.ఎప్పటికప్పుడు మున్సిపాలిటీలో తనిఖీలు చేపట్టి అక్రమ నిర్మాణాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. రవీంద్ర రడేకర్, ఇన్చార్జి సిటీ ప్లానర్ గ్రేటర్ వరంగల్..

## రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం యువత కేంద్రంపై ఐక్యంగా ఉద్యమిద్దాం

### విద్య, వైద్య, ఉపాధి హక్కుల కల్పన పోరాటాలతోనే సాధ్యం

- వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర..ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి




**మేడిపల్లి, మహా:** రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి కోసం యువత కేంద్రంపై ఐక్యంగా ఉద్యమిద్దామని, విద్య, వైద్య, ఉపాధి హక్కుల సాధన పోరాటాలతోనే సాధ్యమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ,కల్లూరు ధర్మేంద్ర అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో జరుగుతున్న ఏఐవైఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 22వ మహాసభలలో తెలంగాణ రాష్ట్ర సమితి నుండి సౌహార్ద సందేశం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ రెండు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత అధికారంలోకి వచ్చిన కేంద్ర ప్రభుత్వం అనేక వాగ్దానాలు ఇచ్చిందని, కానీ ఇప్పటి వరకు ఆ హామీలను నెరవేర్చలేదని అన్నారు. ప్రత్యేక హోదాను ఆంధ్రప్రదేశ్ ఇస్తానని, తెలంగాణకు ప్రత్యేక ప్యాకేజీని ఇస్తానని గత పదేళ్ల కాలంగా రెండు రాష్ట్రాల ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశ వ్యాప్తంగా 245 చిన్న, పెద్ద తరహా ప్రభుత్వ రంగ సంస్థలు మూసివేతబడ్డాయని, దీని కారణంగా ప్రత్యక్షంగా 45లక్షల మంది ఉద్యోగులు నిరుద్యోగులుగా మారారని వారు అన్నారు. దేశంలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించలేని మోడీ మతంతో ప్రజల కడుపు నిండుతుందనే అజ్ఞానపు పోకడలను అనుసరిస్తున్నాడని అన్నారు. ఒక గల్లికో... ఒక జిల్లాకో...ఒక రాజకీయ నేత భజన కోసం ఏర్పడిన యువజన సంఘం ఏఐవైఎఫ్ కాదని, నిరంతరం దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, అవినీతి లేని నూతన సమసమాజ స్థాపన కోసం ఏఐవైఎఫ్ కృషి చేస్తుందన్నారు. భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, సుభాష్ చంద్రబోస్, మహాత్మాగాంధీ ల స్ఫూర్తితో యువతరం ఈ మహాసభలలో చర్చల ద్వారా తీర్మానాలను ఆమోదింపజేసి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవాలని వారు పిలుపునిచ్చారు.

## మైనర్ బాలికపై ప్రిన్సిపల్ లైంగికదాడి





**ఇబ్రహీంపట్నం, మహా:** విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ప్రిన్సిపల్ విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అతనిపై ఇబ్రహీంపట్నం పోలీసులు పోక్సో కేసును నమోదు చేశారు. ఈ ఘటనపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. పాఠశాల ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పాఠశాల గుర్తింపును రద్దు చేయడంతో పాటు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారు పాఠశాలకు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సుమారు గంటసేపు నిరసన వ్యక్తం చేసిన విద్యార్థి సంఘాల నాయకులు ఒక్క సారిగా పాఠశాలలకు తోసుకుపోయే ప్రయత్నం చేశారు. దాంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. పోలీసులు.. ఎస్ఎఫ్ఐ నాయకుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. చివరకు ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ కు తరలించారు. అంతకుముందు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాయికాడి శంకర్ మాట్లాడుతూ.. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే విద్యార్థినిలపై కీచక పర్వానికి పాల్పడితే వారికి రక్షణ ఎక్కడ ఉటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటన జరిగి మూడు రోజులు కావస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కీచక ప్రిన్సిపల్ పై జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారులే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉందన్నారు. కానీ విద్యాశాఖ నిర్లక్ష్యం కారణంగా సదరు బాధిత విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితిని కల్పించాలని మండిపడ్డారు. ఓవైపు విద్యార్థినిలకు రక్షణ లేకుండా పోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్న ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మైనర్ బాలికపై లయోలా పాఠశాల ప్రిన్సిపల్ ఇలాంటి అగాయిత్యానికి పాల్పడిన ఎందుకు అరెస్టు చేయడం లేదని నిలదీశారు. ఇలాంటి ఘటనపై స్పందించకపోతే జిల్లా అధికార యంత్రాంగం ఏ ఘటనకు స్పందిస్తుందని ప్రశ్నించారు. విద్యార్థులు ప్రాణాలు పోయిన తర్వాత హడావుడి చేసే అధికార యంత్రాంగం, ప్రభుత్వాలు ముందస్తుగానే తగు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. ఇప్పటికైనా లయోలా పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఘటన జరిగి మూడు రోజులు అవుతున్న కేసును కప్పిపుచ్చుతున్నారని ప్రశ్నించారు. కేసు తప్పుదారి పట్టించేందుకే ప్రభుత్వ యంత్రాంగం కీచక ప్రిన్సిపాల్ పక్షంగా వ్యవహరిస్తున్నట్లు అర్థమవుతుందని ఆందోళన వెలిబుచ్చారు. విద్యార్థుల ప్రాణాలు అంటే ప్రభుత్వాలకు లెక్క లేకుండా పోయిందన్నారు. చివరికి కీచకులు.. మైనర్ బాలికలను కూడా వదలడం లేదని అందుకు లయోలా పాఠశాలలో జరిగిన ఉదాహరనే నిదర్శనమన్నారు. వెంటనే అతన్ని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని.. అప్పటి వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రిన్సిపల్ పై పోక్సో కేసు నమోదు.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నంలో లయోలా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గా పని చేస్తున్న దినావన్ రావ్ అదే పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థిని పై బుధవారం లైంగికదాడి చేశాడు. సాయంత్రం ఇంటికి వెళ్ళిన బాలిక తన తల్లితో విషయం చెప్పగా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ప్రిన్సిపాల్ పై పోక్సో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. గతంలోనూ విద్యార్థినిలను లోబర్చుకొని అత్యాచారం చేసినట్లుగా అతనిపై ఆరోపణలున్నాయి. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల అదుపులో కీచక ప్రిన్సిపాల్..! మైనర్ విద్యార్థిని పై లైంగికదాడికి పాల్పడిన కీచక ప్రిన్సిపల్ దినావన్ రావ్ ను ఇబ్రహీంపట్నం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. బుధవారం జరిగిన ఈ ఘటనపై గురువారం మైనర్ విద్యార్థిని తల్లిదండ్రులు పోలీసులకు వీడియో చేసిన నేపథ్యంలో వెంటనే పోలీసులు అప్రమత్తమై అతన్ని గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. లయల పాఠశాలయ ఎదుట నిర్వహించిన ఆందోళనలో ఎస్ఎఫ్ఐ నాయకులు చరణ్, తరంగ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నాగార్జున సాగర్ జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు.

## బీసి కులగణన పేరుతో బీసీల నెత్తిన బస్మాసుర హస్తం



**ఉప్పల్,మహా:** రాష్ట్ర శాసనసభ సాక్షిగా బీసీ కుల గణన వివరాలు తెలిపిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ ల పట్ల వారి చిత్తశుద్ధి ఏరకంగా ఉందో తెలుస్తుంది అని బిజెపి రాష్ట్ర నాయకులు సిలివేరు శంకర్ ప్రజాపతి అన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం గానీ, గత ప్రభుత్వం 2014 లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం గానీ బీసీల జనాభా 51 శాతం కన్నా ఎక్కువ. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన బీసీ కుల గణన తరువాత కేవలం 56 శాతం అంటే కుల గణన ఎంత అశాస్త్రీయమైన పద్ధతిలో జరిగిందో తెలుస్తుంది. బీసీల గణనలో ముస్లిం బీసీ లు కూడా ఉన్నారని చెప్పడం తీవ్రంగా ఆలోచించవలసిన విషయం. బీసీ కుల గణన పేరుతో బీసీ ల జనాభా గణనీయంగా తగ్గిందని ఓసీ ల జనాభా పెరిగిందని వెల్లడించడం కాంగ్రెస్ కుటిల రాజకీయాలకు నిదర్శనం. సమగ్ర బీసీ ల లెక్కలే ఇంత దారుణంగా వెల్లడించిన వారు రేపు కులాల వారీగా వెల్లడించే లెక్కలు కూడా తప్పుల తడకగానే వెల్లడిస్తారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కాంగ్రెస్ తమ వైఖరి ఖచ్చితంగా చెప్పకుండా డొంకతిరుగుడుగా వ్యవహరిస్తోంది. ప్రకించించిన ప్రతి హామీని నెరవేర్చకపోగా బీసీ, ఎస్సి, ఎస్టి, ఓసీ, మైనారిటీ పేర్లతో వివాదాలుకు తెరదీసి ప్రజలను అయోమయంలో పడేస్తున్నారు. మంత్రి పదవులు మొదలుకొని కమీషన్ల చైర్మన్ల పదవులదాకా బీసీల పట్ల వివక్ష చూపి కాంగ్రెస్ కపట ప్రేమను నటిస్తుంది. ఆరు గ్యారెంటీల అమలులో ఘోరంగా విఫలమైన కాంగ్రెస్, రాష్ట్ర ప్రజలను అయోమయంలోకి నెట్టింది.

# కళ్యాణ వేడుకల్లో కంది మౌనా శ్రీనివాస రెడ్డి








**ఆదిలాబాద్ మహా :** పెళ్లిళ్ల సీజన్ మాఘ మాసం ఆరంభం కావడంతో కళ్యాణ వేదికలన్నీ కళకళలాడు తున్నాయి.ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పై అభిమానంతో ఆహ్వానించిన వారి వివాహాది శుభకార్యాలకు ఆయన స్థానికంగా లేక పోవడంతో ఆయన తరపున కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు. కళ్యాణ మండపాలలో మిత్రులు , శ్రేయోభిలాషులు అభిమానులను ఆప్యాయంగా పలకరించారు. పట్టణంలోని పలు ఫంక్షన్ హాళ్ల లో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన దంపతులు ప్రియాంక సాయి శ్రీనివాస్,మేఘన రెడ్డి సాయి తేజ రెడ్డి,లక్ష్మి నేత్ర సాయి లోహిత్ ,కావ్య రెడ్డి, సూరజ్ రెడ్డి,వర్షిత ప్రసాద్ లకు వివాహ శుభాకాంక్షలు తెలిపి కంది శ్రీనన్న పెళ్లికానుక బహుకరించారు.ఆమె వెంట గడ్డం శరణ్య రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,ఎం.ఏ షకీల్,ఎల్మ రామ్ రెడ్డి,అంజద్ ఖాన్,మహిళా నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో చోరీ

- హుండీలో నగదు, అభరణాలు అపహరణ
- ఆరోవ సారి చోరీ
- పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆగని చోరీలు



**ములుగు, మహా :** ములుగు పంచాయతీ పరిధి ప్రేమ్ నగర్ శివారులో గల సాయిబాబా ఆలయంలో చోరీ జరిగింది. దొంగలు ఆలయంలోని హుండీలో నగదు, భక్తులు వేసిన కానుకలను ఎత్తుకెళ్లినట్లు ఆలయ వ్యవస్థాపకులు ఆకుల ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆరుసార్లు చోరీ జరగగా పోలీసులకు ఫిర్యాదు చేశామని, నిందితులను ఇంకా గుర్తించలేదని పేర్కొన్నారు. హుండీని పగలగొట్టి అపహరణ చేసిన దొంగల వివరాలు ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీలో రికార్డు అయ్యాయి. రోజువారి చర్యలో భాగంగా శుక్రవారం ఉదయం పూజలు నిర్వహించేందుకు ఆలయ అర్చకులు అన్వేష్ ఆలయానికి వెళ్ళగా ఉండిని గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అపహరణ చేసినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఆలయ వ్యవస్థాపకులు ప్రవీణ్ కుమార్ ములుగు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయాన్ని సందర్శించిన పోలీసులు దొంగల కోసం దర్యాప్తు చేస్తున్నారు. కాగా సాయిబాబా ఆలయంలో ఆరుసార్లు దొంగతనం జరిగిన నిందితుడిని గుర్తించడంలో నిర్లక్ష్యం కనబడుతోందని ఆలయ వ్యవస్థాపకులు ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆలయానికి సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై విద్యుత్ లైట్లు కొద్దిరోజులు వెలగకపోవడంతో ఈ దొంగతనం జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెంటనే దొంగలను గుర్తించి మరోసారి దొంగతనం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రేమనగర్ గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు. ప్రేమ్ నగర్ సాయి బాబా ఆలయానికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



## వర్కింగ్ జర్నలిస్టులకు ప్రమాద బీమా తప్పనిసరి

### కలెక్టర్ డాక్టర్ సత్యశారద

**వరంగల్, మహా:** టీ.ఎస్.జే.యు రాష్ట్ర అధ్యక్షుడు నారగోని పురుషోత్తం గౌడ్ ఆధ్వర్యంలో వరంగల్ టీఎస్ జేయు యూనియన్ సభ్యులందరికీ ఐదు లక్షల ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని అందజేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో దీనికి సంబంధించిన బీమా పత్రాలను జిల్లా కలెక్టర్ సత్య శారదా చేతుల మీదుగా సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో భాగంగా ఎంతో మంది జర్నలిస్టులు ప్రమాదాలకు గురై ఇబ్బందులు పడుతుంటారు. ఆ సమయంలో వీరికి ప్రమాద బీమా ఎంతగానో ఉపయోగపడుతుంది అని అన్నారు. టీఎస్ జెయు యూనియన్ సభ్యులకు ప్రమాద బీమా కల్పించడం అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ జేయు రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం గౌడ్ నారగోని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, సహాయ కార్యదర్శి రావుల నరేష్, జిల్లా అధ్యక్షులు కందికొండ మోహన్, ప్రధాన కార్యదర్శి ఆవునూరి కుమారస్వామి, ఉపాధ్యక్షులు లింగబత్తిని కృష్ణ, కందికొండ గంగరాజు, ఈద శ్రీనాథ్, బత్తుల సత్యం, సభ్యులు కౌడగాని మోహన్ రావు, నీరుటి శ్రీహరి, అడుప అశోక్, మంతెన సురేష్, అవినాష్, బొక్క రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వవద్దు



**ములుగు, మహా :** వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని ములుగు జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ మరియు జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి సి హెచ్ మహేందర్ జి కోరారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు నియమించబడిన పిఓ, ఏపిఓ ల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం జారీ చేసిన పిఓ హ్యాండ్ బుక్ ను బాగా చదవాలని చెప్పారు. పిఓ, ఏపీవో వారికి కేటాయించిన విధుల ప్రకారం పోలింగ్ నిర్వహించాలన్నారు. పీవో పోలింగ్ కేంద్రంలో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రదర్శింపచేయడం, అభ్యర్థుల ఏజెంట్ల జాబితా పరిశీలన, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రకారం ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం వంటి అన్ని అంశాల పట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అంతేకాక బ్యాలెట్ బాక్సులు ముందే తనిఖీ చేసుకోవాలని, పోలింగ్ కు ముందే ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ లు తెరిచి చూపించాలని, అప్పుడే ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు వారికి తెలుస్తుందని అన్నారు. డిక్లరేషన్ అలాగే పోల్ ప్రారంభం వంటి వాటి పట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రం పరిధిలో శాంతిభద్రతలు, అలాగే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించబడే వారి వివరాలు అన్నింటి పట్ల పిఓ, ఏపిఓ లు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రాధాన్యత క్రమంలో ఓటర్లు ఓటు వేయవలసి ఉంటుందని, ఇందుకు ఎన్నికల కమిషన్ అంగీకరించిన వైలెట్ కలర్ స్కెచ్ పెన్ మాత్రమే వాడాలని ఈ విషయం ముందే ఓటర్లకు తెలియజేయాలని చెప్పారు. ఎన్నికలలో ఫారం 16 అత్యంత కీలకమని అన్నారు. బ్యాలెట్ పేపర్ కు సంబంధించి ఎలాంటి పొరపాట్లు లేకుండా తీసుకున్న బ్యాలెట్లు, ఓటింగ్ తర్వాత అప్పజెప్పే బ్యాలెట్ పేపర్ల విషయంలో తేడాలు లేకుండా చూసుకోవాలని, వినియోగించిన బ్యాలెట్లను సైతం సీరియల్ నంబర్ తో సహా వేసుకొని సమర్పించాలన్నారు. ఎన్నికలలో పిఓ డైరీ అత్యంత కీలకమని ఆయన తెలిపారు. అలాగే స్టాట్యూరీ నాన్ స్టాట్యూరీ కవర్లు వీటన్నిటి పట్ల అవగాహన కలిగి ఉండాలని, మరోసారి ఎన్నికలకు సంబంధించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఎట్టి పరిస్థితులలో ఎన్నికల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించవద్దని పూర్తి జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాల్సిందిగా ఆయన కోరారు. Mఈ కార్యక్రమంలో ఆర్డిఓ (ఏఆర్ఓ) వెంకటేష్, ములుగు తహసిల్దార్ విజయ భాస్కర్, సూపరిండెంట్ శివ కుమార్, ఎన్నికల శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

## అగ్రి షోలో పాల్గొన్న మంత్రి తుమ్మల

### రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయాలని ఆదేశం



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన కిసాన్ అగ్రి షోలో రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ మంత్రి తుమ్మల పాల్గొని, రైతాంగం, వ్యవసాయ పరిశ్రమలు, నూతన సాంకేతికతలను ఒకే వేదికపైకి తేవడంలో ఈ షో కీలక పాత్ర పోషిస్తుందని ప్రశంసించారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, రైతుల ఆదాయ వృద్ధికి ఆధునిక యంత్రాలు, నూతన సాంకేతికతలు ఎంతగానో ఉపకరిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల కోసం అనేక విధానాలను, సబ్సిడీలను, రుణమాఫీ, రైతు భరోసా, నిరంతర శిక్షణ వంటి కార్యక్రమాలను అమలు చేస్తూ ఇప్పటివరకు రూ. 40,000 కోట్ల నిధులను నేరుగా రైతులకు అందించామని వెల్లడించారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా డ్రోన్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, సబ్సిడీపై ఆధునిక యంత్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. కిసాన్ అగ్రి షోను కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా, అన్ని జిల్లా కేంద్రాల్లోనూ వ్యవసాయ సీజన్ ప్రారంభంలో నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. మహబూబ్‌నగర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన అగ్రి ఎగ్జిబిషన్ గొప్ప విజయాన్ని సాధించిందని, అదే విధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రభుత్వ సహకారంతో ఇలాంటి షోలు నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖలను సమన్వయం చేసి రైతులకు వేగంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, బాంబో మిషన్ ద్వారా గిరిజన రైతులకు మరింత ప్రయోజనం కలిగే విధంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపీ, కిసాన్ అగ్రి షో నిర్వాహకులు, వివిధ జిల్లాల అధికారులతో పాటు పలువురు వ్యవసాయ నిపుణులు పాల్గొన్నారు.





## పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించండి

- బల్దియా అదనపు కమిషనర్ జోనా
- రూ.1109164 పన్ను చెల్లించిన కాసం ఫ్యాషన్స్

**వరంగల్, మహా:** గ్రేటర్ వరంగల్ నగర ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని బల్దియా అదనపు కమిషనర్ జోనా అన్నారు. బల్దియా పరిధి హంటర్ రోడ్ లోగల కాసం ఫ్యాషన్స్ యాజమాన్యం ఆస్తి పన్ను రూ.1109164 పన్ను చెల్లింపు కు చెందిన చెక్ ను సదరు యాజమాన్యం శుక్రవారం అదనపు కమిషనర్ కు అందజేశారు.

ఈ సందర్భం గా అదనపు కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధి లోని వివిధ వాణిజ్య సంస్థలు , గృహాలు వారి ప్రాపర్టీ పన్నులు విధిగా చెల్లించి కార్పొరేషన్ కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి రెవెన్యూ అధికారి షెహజాది బేగం ఆర్ ఐ లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు

## బల్దియా వార్డు ఆఫీసర్ల చేతివాటం

### బి ఎస్ పి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను అనిల్ కుమార్



**వరంగల్, మహా:** గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ లోని వార్డు ఆఫీసర్లు పన్నుల వసూళ్ల లో చేతివాటం చూపిస్తున్నారని బి ఎస్ పి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను అనిల్ కుమార్ ఆరోపించారు. ఇంటి పన్ను వసూలు చేస్తూనే ఇంటి యజమానులను మీకు ఎక్కువ హౌస్ టాక్స్ వేస్తాము అంటూ బెదిరించడం తోపాటు మా మాట విని అడిగినంత ముడుపులు ఇస్తేనే ఇంటి పన్ను తగ్గిస్తామని గ్రేటర్ వరంగల్ నగరం లోని పలు డివిజన్లలో విచ్చలవిడిగా ముడుపులకు అలవాటు పడి ఎక్కడ పడితే అక్కడ డబ్బులు వసూలు చేస్తున్నారని ఘాటు విమర్శలు చేశారు. కొంతమంది ఇంటి యజమానులు ఇదేంటని ప్రశ్నించిన వారి పై మా ఇష్టం ఇలాగే వసూలు చేస్తాం మీరు ఏం చేస్తారు మీ దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ సమాధానం ఇస్తున్నారని వాపోయారు. సదరు ఇంటి యజమానులు వేలల్లో చెల్లించవలసిన ఇంటి పన్ను తప్పించుకునే క్రమంలో వార్డు ఆఫీసర్లకు ఎంతోకొంత ఇచ్చి జారుకుంటున్నారు. ఇది ఇలాగే కొనసాగితే వరంగల్ కార్పొరేషన్ కు పన్నులు ఎగవేతదారుల సంఖ్య పెరిగి బల్దియా ఆదాయానికి పెద్ద గండి అరే అవకాశం ఉందని అన్నారు. ఈ విషయం పై బల్దియా కమిషనర్ స్పందించి వెంటనే ఇలాంటి పని చేసిన వారిని చట్టపరంగా శిక్షించాలని వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎందుకు జన్ను అనిల్ కుమార్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు



## రాజేందర్ నగర్ లోని ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన

### జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, మహా:** శుక్రవారం రంగారెడ్డి జిల్లా రాజేందర్ నగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను జిల్లాకలెక్టర్ సి.నారాయణ రెడ్డి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్ర స్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించి, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి.ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట రాజేందర్ నగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## శ్రీనివాస్ చారి కుటుంబానికి ఆర్థిక సాయం



**యాచారం, మహా:** మాల్ గ్రామపంచాయతీ పరిధి లోని ఇందిరమ్మ కాలనీలో ముమ్మడి శ్రీనివాసాచారి మరణించడంతో యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ ముదిరాజ్ వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం కింద రూ 5000/ ల చెక్కు అందించడం జరిగింది. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ తరపున వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇస్తు, పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. మాల్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి పేదవారికి అండగా ఉంటానని హామీ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొల్లపల్లి భాస్కర్ గౌడ్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చిన్నోల యాదయ్య, కొప్పుల వెంకటేష్ గౌడ్, దర్శనం రాజు, కారింగ శంకర్ ముదిరాజ్, గణేష్ గౌడ్, నర్సింహా, దూసరి శివ కుమార్, దేరంగుల శివ లింగం, మరియు కుటుంబ సభ్యులు తదితరులు ఇందిరమ్మ కాలనీవాసులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తూ పట్టుబడిన విలేకరులు

- బూర్గంపాడు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడితో పాటు మరో ఇద్దరు అరెస్టు
- ప్రెస్ ముసుగులో నకిలీల దందలు
- చిల్లరగా మారిన చిల్లర గాళ్లతో బజారున పడుతున్న జర్నలిజం

**మహా :** జర్నలిజం పేరుతో ప్రెస్ స్టిక్కర్లు తగిలించుకొని అక్రమ దందాలకు వసూళ్లకు పాల్పడుతున్న మరో ఉదంతం వెలుగులోకి వచ్చింది. జర్నలిజం వృత్తిని అపహాస్యం పాలు చేస్తున్న దుర్మార్గులు చట్టం దృష్టిలో తప్పించుకోలేరని మరోసారి రుజువైంది. భద్రాచలంలో హైదరాబాద్ నార్కోటిక్స్ డిపార్ట్మెంట్ అధికారులు గోదావరి బ్రిడ్జి చెక్ పోస్ట్ దగ్గర జరిపిన వాహన తనిఖీల్లో బూర్గంపాడు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పండగ రాములు, అతని సోదరుడు పండగ వెంకటేశ్వర్లు, మరో వ్యక్తితో కలిసి కారులో తరలిస్తున్న గంజాయితో పట్టుబడ్డాడు. భద్రాచలం ప్రాంతంలో గంజాయి రవాణా చేస్తూ, అనేకమంది అనేక సందర్భాల్లో పోలీసులకు పట్టుబడిన సంఘటనలు జరుగుతున్నాయి. పాత్రికేయులే గంజాయి తరలిస్తూ, పట్టుబడటం తీవ్ర సంచలనం సృష్టించింది. హైదరాబాద్ కు చెందిన నార్కోటిక్స్ అధికారులు స్థానిక బ్రిడ్జి చెక్ పోస్ట్ వాహనాలు తనీఖీలు చేసే సమయంలో వచ్చిన హ్యుండాయ్ గ్రాండ్ ఐ10 ఆస్టా (నంబర్: AP37 BU 5216) కారును తనిఖీ చేశారు. ఆ కారులో ఉన్న 81.950 కిలోల ఎండు గంజాయి వారికి లభ్యమైంది. ఆ గంజాయి తరలిస్తున్న ఆకారులోని ముగ్గురు వ్యక్తులను అదుపు లోకి తీసుకుని విచారించిన నార్కోటిక్స్ అధికారులు వారి వివరాలు రాబట్టారు. వారిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని సోంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి, బూర్గంపాడు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పండగ రాములు (సూర్య పత్రిక విలేకరి) పట్టుబడ్డాడు. అతని తమ్ముడు మరో విలేకరి పండగ వెంకటేశ్వర్లు (తెలంగాణ కేసరి పత్రిక), ఛత్తీస్ గఢ్ రాష్ట్రం, సుక్మా జిల్లా, కుంట తాలూకా మర్లగూడ గ్రామానికి చెందిన మడవినంద కూడా పట్టుబడ్డారు. కారు, గంజాయి తో సహా స్వాధీనం చేసుకున్న అధికారులు వాటితోపాటు నిందితులను భద్రాచలం టౌన్ పోలీసులకు అప్పగించి వివరాలు వెల్లడించారు.

## పదవీ విరమణ చేసిన హోంగార్డ్ ను సత్కరించిన సిపి



**హనుమకొండ, మహా:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుధీర్ఘ కాలం హోంగార్డ్ విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన హోం గార్డ్ సుదర్శన్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ శుక్రవారం సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. భవిష్యత్ లో ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలని సిపి పదవి విరమణ చేసిన హోం గార్డ్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ నాగయ్య, ఆర్.ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# మీ సిబిల్ రిపోర్ట్ చెక్ చేయట్లేదా?

## ఈ తప్పులు చేస్తే చిక్కుల్లో పడాల్సిందే



ఒకరి ఫైనాన్షియల్ హెల్త్‌ని అంచనా వేయడానికి క్రెడిట్ రిపోర్టు ఉపయోగపడుతుంది. ఇందులో తీసుకున్న లోన్లు, రీపేమెంట్స్, లోన్ ఎంక్వైరీలు వంటి అన్ని వివరాలు ఉంటాయి. అందుకే రెగ్యులర్‌గా ఈ రిపోర్ట్‌ను చెక్ చేయాలి. మీకు తెలియకుండా ఏవైనా లావాదేవీలు జరిగి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవచ్చు. లేకపోతే మీరు తీవ్రంగా నష్టపోతారు. ఇంతకీ మీ క్రెడిట్ రిపోర్ట్‌ను చివరిసారిగా ఎప్పుడు చెక్ చేశారు? మీ సమాధానం "గుర్తు లేదు, చేయలేదు" వంటివి అయితే మీరు రిస్కులో ఉన్నట్లే. చాలా మంది లోన్‌కి అప్లై చేసినప్పుడు మాత్రమే క్రెడిట్ రిపోర్ట్ గురించి ఆలోచిస్తారు. ఇలా పట్టించుకోకుండా ఉంటే, చిన్న మిస్టేక్ కూడా మీ ఫైనాన్షియల్ హెల్త్‌ని పూర్తిగా హరించేస్తుంది. అవసరమైనప్పుడు లోన్ పొందడానికి, ఈఎంఐలు సకాలంలో చెల్లిస్తే సరిపోతుందని చాలా మంది అనుకుంటారు. అయితే మీ క్రెడిట్ రిపోర్టులోని హిడెన్ ఇష్యూస్ కారణంగా కూడా లోన్లు రిజెక్ట్ అవుతాయి. లేదా అధిక వడ్డీ రేట్లకు లోన్ తీసుకోవాల్సి వస్తుంది. మీరు సొంతింటి కోసం సంవత్సరాల తరబడి సేవింగ్స్ చేసి, లోన్‌కి అప్లై చేస్తే రిజెక్ట్ అయితే, పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి. చాలా ఏళ్ల క్రితం మరచిపోయిన ఒక చిన్న ఓవర్‌డ్యూ పేమెంట్ ఇందుకు కారణం కావచ్చు. మీ క్రెడిట్ రిపోర్ట్‌లో ఇలాంటి చిన్న పొరపాటు అయినా మీ లోన్‌ని ఆపేస్తుంది.

**క్రెడిట్ రిపోర్టులో సాధారణ సమస్యలు**

పాత ఓవర్‌డ్యూ అకౌంట్లు: చాలా సంవత్సరాల క్రితం నాటి చెల్లించని చిన్న పేమెంట్ కూడా మీ క్రెడిట్ స్కోర్‌ను తగ్గిస్తుంది.

**స్మాల్ అన్‌పెయిడ్ అమౌంట్స్..**

పాత క్రెడిట్ కార్డ్‌పై చెల్లించని రూ.100 వంటి చిన్న మొత్తాలు కూడా పెద్ద సమస్యను సృష్టించవచ్చు.

**ఎర్రర్స్, మిస్‌రిపోర్టింగ్:**

తప్పుడు అకౌంట్ స్టేటస్‌లు, తప్పుడు అవుట్‌స్టాండింగ్ అమౌంట్‌లు, మీరు తీసుకోకుండానే లోన్‌లు తీసుకున్నట్లు రిపోర్ట్ చేసే అవకాశం ఉంది.

**మోసపూరిత అకౌంట్లు:**

ఎవరైనా మీ వివరాలు దొంగిలించి, మీ పేరిట బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయవచ్చు.

**హై క్రెడిట్ యూసేజ్:**

మీకు అందుబాటులో ఉన్న క్రెడిట్‌ను ఎక్కువగా ఉపయోగించడం కూడా ప్రతికూలంగా మారుతుంది.

**సెటిల్ చేసిన రుణాలు:**

కొత్త రుణాలను అప్రూవ్ చేసే ముందు బ్యాంకులు ఈ రికార్డులను చెక్ చేస్తాయి.

### మీ క్రెడిట్ రిపోర్ట్ ఎలా చెక్ చేయాలి?

**అన్ని బ్యాంక్ అకౌంట్ల లేబుల్స్ సరిగ్గా ఉన్నాయో లేదో చూడండి. ఉదాహరణకు ఓవర్‌డ్యూ అని కాకుండా "స్టాండర్డ్" అని ఉండాలి. అలానే మీరు తీసుకున్న పర్సనల్ లోన్‌స్‌కి "బిజినెస్ లోన్"గా పేర్కొన్నారేమో చూడండి. మీ క్రెడిట్ కార్డ్ వినియోగాన్ని కరెక్టుగా రిపోర్టు చేశారో లేదో పరిశీలించండి. రిపోర్టులో గుర్తు తెలియని అకౌంట్ ట్రాన్సాక్షన్లు ఉంటే అప్రమత్తం అవ్వండి. ఏవైనా లోన్, బ్యాంక్ అకౌంట్‌లు క్లోజ్ అయి ఉంటే, సక్రమంగా పేర్కొన్నారో లేదో పరిశీలించండి. అన్ని పేమెంట్లు సక్రమంగా రికార్డ్ అవుతున్నాయో లేదో సరి చూసుకోండి.**


# సాయంత్రంలోపు క్యాంపస్‌ను వీడండి.. ట్రైనీలకు ఇన్ఫోసిస్ అల్టిమేటం..!




దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. రెండేళ్ల క్రితం ఫ్రెషర్ల పట్ల కఠిన వైఖరిని ప్రదర్శించిన ఇన్ఫీ.. గతేడాది వారిని విధుల్లోకి తీసుకున్న విషయం తెలిసిందే. అయితే, తాజాగా అందులోని కొందరు ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు క్యాంపస్‌లో శిక్షణ పొందుతున్న దాదాపు 400 మంది ట్రైనీలకు లేఆఫ్‌లు ఇచ్చేందుకు రెడీ అయినట్లు జాతీయ మీడియా పేర్కొంది. వరుసగా మూడు సార్లు అంచనా పరీక్షల్లో విఫలమైన కారణంగా వారిని తొలగిస్తున్నట్లు తెలిసింది. ట్రైనీలను 50 మందితో కూడిన బ్యాచ్‌లుగా పిలిచి వారితో మ్యూచువల్ సెపరేషన్ లెటర్లపై సంతకాలు చేయిస్తున్నట్లు సమాచారం. ఇవాళ సాయంత్రం 6 గంటల్లోపు ట్రైనీలంతా క్యాంపస్‌ను వీడాలని అల్టిమేటం జారీ చేసినట్లు తెలిసింది. అయితే, ట్రైనీల తొలగింపుపై ఇన్ఫీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. లేఆఫ్‌లకు గురైన ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు జాతీయ మీడియా నివేదించింది. తాము ఫెయిల్ అవ్వాలనే పరీక్షలను చాలా కఠినంగా పెట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు తమ భవిష్యత్తు కష్టంగా మారిందంటూ వాపోతున్నారు.

# రతన్ టాటా వీలునామాలో రహస్య వ్యక్తి పేరు


## ఇంతకీ ఎవరీ మిస్టరీ మ్యాన్..?



టాటా సంస్థల అధినేత రతన్ టాటా కొన్ని రోజుల క్రితం మరణించిన విషయం తెలిసిందే. రతన్ టాటా కేవలం లక్షల కోట్ల సామ్రాజ్యానికి అధిపతిగా మాత్రమే కాకుండా, గొప్ప మానవతావాదిగా, సమాజ సేవకుడిగా పేరుపొందారు. ఆయన మరణానంతరం రూ.వేల కోట్ల ఆస్తిని తాను నెలకొల్పిన ఫౌండేషన్‌లకు, సోదరుడు జిమ్మీ టాటాతోపాటు తన సహాయకులు, పెంపుడు శునకానికి చెందేలా వీలునామా రాసి తన మంచి మనసు చాటుకున్న విషయం తెలిసిందే. అయితే వీలునామాలో ఓ రహస్య వ్యక్తికి రూ.వందల కోట్లు ఇవ్వాలంటూ రతన్ టాటా పేర్కొనడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆ వీలునామాలో ఉన్న రహస్య వ్యక్తి పేరు చూసి టాటా కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నట్లు జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. ఆ మిస్టరీ పర్సన్ ఎవరో కాదు దాదాపు ఆరు దశాబ్దాలుగా రతన్ టాటాకు నమ్మకస్తుడిగా సేవలు అందించిన జంషెడ్‌పూర్‌కు చెందిన ట్రావెల్స్ వ్యాపారవేత్త మోహిని మోహన్ దత్తా అని తెలిసింది. తాజ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్‌లో భాగమైన తాజ్ సర్వీసెస్‌తో 2013 నుంచి మోహన్ దత్తాకు చెందిన స్టాలియన్ ట్రావెల్ ఏజెన్సీ కలిసి పనిచేస్తోంది. అంతేకాదు టాటా కుటుంబానికి మోహన్ దత్తా చాలా సన్నిహితంగా ఉండేవారని టాటా గ్రూప్‌కు చెందిన అధికారులు తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో ముంబైలోని ఎన్‌సీపీఏలో నిర్వహించిన రతన్ టాటా జన్మదిన వేడుకలకు సైతం దత్తాను ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు సమాచారం. మోహన్ దత్తాకు తన ఆస్తిలో రూ.500 కోట్లు ఇవ్వాలని రతన్ టాటా వీలునామాలో పేర్కొన్నట్లు తెలిసింది.

## రెపో రేటు పావు శాతం తగ్గించిన ఆర్బీఐ..

# ఐదేళ్ల తర్వాత తొలిసారి



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడ్ న్యూస్ చెప్పింది. విశ్లేషకుల అంచనాలను నిజం చేస్తూ కీలక వడ్డీ రేట్లను తగ్గించింది. దాదాపు ఐదు సంవత్సరాల తర్వాత మొదటిసారిగా రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఇటీవలి బడ్జెట్ నేపథ్యంలో ఈ ద్రవ్యసమీక్షపై అటు వ్యాపారపారిశ్రామిక రంగాలు, ఇటు బ్యాంకర్లు రుణగ్రహీతలు భారీగానే ఆశలు పెట్టుకున్నారు. దీనికి తగ్గట్టుగానే రెపో రేటును పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) కోత పెట్టింది ఆర్బీఐ. తాజా నిర్ణయంతో ఇప్పటి వరకూ 6.50 శాతంగా ఉన్న రెపో రేటు 6.25 శాతానికి దిగొచ్చింది. అలాగే రెండేళ్ల తర్వాత వడ్డీ రేట్లను సవరించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

**ఐదేండ్ల తర్వాత..**

గత రెండేండ్లుగా వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే ఆర్బీఐ ద్రవ్యసమీక్షలు ముగుస్తున్నాయి. 2023 ఫిబ్రవరిలో చివరిసారిగా రెపో రేటును 6.50 శాతానికి పెంచారు. అప్పట్నుంచి ఇది అక్కడే ఉంటున్నది. ఇక రెపో రేటును ఆఖరిసారిగా తగ్గించింది 2020 మే నెలలోనే. కరోనా దెబ్బకు దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థలో నూతనోత్సాహాన్ని నింపేందుకు నాటి గవర్నర్ శక్తికాంత్ దాస్ ప్రత్యేకంగా ఆర్బీఐ సమీక్ష నిర్వహించి రెపో రేటును తగ్గించారు. రుణ లభ్యత పెరిగేలా 4 శాతానికి దించారు. కానీ ద్రవ్యోల్బణం విజృంభించడంతో తదుపరి ద్రవ్యసమీక్షల్లో దాన్ని అదుపు చేసేందుకు మళ్లీ వడ్డీరేట్లను వరుసగా పెంచుతూ పోయారు. ఈ క్రమంలో ఐదేళ్ల తర్వాత ఇప్పుడు వడ్డీరేట్లను ఆర్బీఐ తగ్గించడం విశేషం. ఈ తగ్గింపుతో రుణాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశం ఉంది.




# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# ట్రంప్ ప్రయత్నం అమోఘం..

## ఇండియాలో ఇంత సాహసం చేసే నాయకులు లేరా..?

అమెరికా వెళ్లాలనే కల చాలా మందికి ఉంటుంది. ఎందుకంటే.. మన భారత్ లో కంటే అమెరికాలో జీవన విధానం బాగుంటుంది. ఇక్కడ ఒక్క రూపాయి సంపాదిస్తే.. అక్కడ రూ.5లకు సమానంగా ఉంటుంది. అందుకే ఎక్కువ శాతం మంది అమెరికా వెళ్లి ఎక్కువ డబ్బులు సంపాదించి.. మన ఇండియా తిరిగి రావాలని కోరుకుంటూ ఉంటారు. మరికొంత మంది గ్రీన్ కార్డు పొంది అక్కడే స్థిరపడాలనుకునే వారు కూడా ఉంటారు. దీని కోసం ఒక్క ఇండియా నుంచే కాకుండా.. ప్రపంచవ్యాప్తంగా కూడా అమెరికా వెళ్లాలని.. ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. ఆ కల అందరికీ తీరకపోవచ్చు. లీగల్ గా వెళ్లి.. అక్కడే ఉంటూ లక్షల్లో సంపాదించే వాళ్లు ఉన్నారు. లీగల్ గా వెళ్లి.. విఫలమైన వాళ్లు ఆ కలను కలలాగే మిగిల్చకుండా.. దానిని సాకారం చేసుకునే విధంగా ప్రయత్నం చేస్తుంటారు. అందులో భాగంగా.. ఏజెంట్లను నమ్మి.. లక్షల్లో మోసం పోయిన వారు ఇల్లీగల్ గా వెళ్లేందుకు ప్రయత్నించారు. అంటే.. ఇండియా నుంచి సౌత్ అమెరికాలోని మెక్సికో దేశానికి వెళ్లి.. అక్కడ నుంచి అమెరికాకు డంకీ రూట్ ద్వారా వెళ్లారు. డంకీ రూట్ లో అమెరికాకు వెళ్లడం అంత సులువు కాదు. ఎన్నో వ్యయప్రయాసలు కూడుకొని వెళ్లాల్సి ఉంటుంది. అడవిలో 40 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా.. జర్నీ కొనసాగించాల్సి ఉంటుంది. అయితే ఈ జర్నీలో ప్రాణాలు కూడా పోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఇలా డాంకీ రూట్ ఎంచుకున్న వారు అమెరికాలోకి అక్రమంగా వెళ్తుంటారు. అక్కడ బోర్డర్ లో గస్తీ కాస్తున్న పోలీసులకు దొరికితే జైలు జీవితం గడపాల్సి ఉంటుంది. ఇలా ఎంతో కష్టంతో కూడుకున్నది ఈ డంకీ రూట్.





# ఆ రహస్య దేశానికి వెళ్తే టైమ్ ట్రావెల్ చేసినట్లే...

## అందంగా, మోడ్రన్‌గా ఉంటుంది కానీ మనుషులు కనిపించరు!

కరోనా సమయంలో.. మనుషులు లేని షాపింగ్ మాల్స్, నిర్మానుష్య రోడ్లను మీరు చూసి ఉంటారు. ఆ దేశం సరిగ్గా అలాగే ఉంటుంది. అక్కడ మీరు ప్రతీ క్షణం ఆశ్చర్యపోతూనే ఉంటారు. ఈ భూమిపై ఉన్న విషయం మర్చిపోతారు. మరో గ్రహంపై ఉన్న ఫీల్ కలుగుతుంది. ఆ దేశం ఏదో తెలుసుకోండి మరి. మీరు ప్రపంచంలో అరుదైన, ఆశ్చర్యకరమైన, రహస్య దేశానికి వెళ్లాలి అనుకుంటున్నారా? అయితే లగేజీ సర్దుకోండి. మీ కోసం ఒక దేశం రెడీగా ఉంది. అక్కడ మీరు ఆశ్చర్యపోవడానికి చాలా ఉన్నాయి. అదమైన రాజ భవనాలు కట్టిపడేస్తాయి. చూద్దామన్నా మనుషులు కనిపించరు. ఆ దేశం ఉత్తర కొరియా అని అనుకుంటున్నారేమో. ఎందుకంటే.. ఉత్తర కొరియా అలాంటిదే. కానీ.. ఇప్పుడు మనం చెప్పుకునేది.. అంతకంటే మిస్టరీ దేశం. చిత్రమేంటంటే.. ఆ దేశానికి వెళ్లడానికి ఎలాంటి అభ్యంతరాలూ లేవు. కానీ ఎవరూ వెళ్లరు. అక్కడ సందర్శించడానికి బోలెడన్ని పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. కానీ పర్యాటకులే ఉండరు. అంతా నిర్మానుష్యమే. ఆ దేశం చాలా అందంగా ఉంటుంది. ఎంతో పరిశుభ్రంగా ఉంటుంది. అక్కడి అందమైన భవనాలు చూపు తిప్పుకోనివ్వవు. రాజ భవనాలు.. కట్టిపడేస్తాయి. చివరకు హోటళ్లు సైతం ఇంద్రభవనాల్లాగా ఉంటాయి. భారత్ లాంటి అత్యధిక జనాభా ఉన్న మన దేశం ఎవరైనా ఆ దేశానికి వెళ్లారంటే.. మతి పోతుంది. ఎందుకంటే.. అది భూమిపై ఉన్న దేశం లాగా అనిపించదు. మనుషులే ఉండరు. ఆ దేశమే తుర్క్‌మెనిస్తాన్ మిడిల్ ఈస్ట్‌లో ఆఫ్ఘనిస్తాన్ పైన మీకు తుర్క్‌మెనిస్తాన్ కనిపిస్తుంది. ఈ దేశం 1925 నుంచి 1991 వరకు రష్యా సోవియట్ యూనియన్‌లో భాగంగా ఉంది. ఇక్కడ నివసిస్తున్న వారిలో 60 శాతం మంది టర్కిష్ వారు. ఈ దేశ రాజధాని అష్గాబాత్ (Ashgabat), అంటే ప్రేమ నగరం అని అర్థం. తుర్క్‌మెనిస్తాన్‌కి వచ్చే వారికి ఎలాంటి పరిమితీ లేదు, కానీ ఈ దేశం వీసా అంత ఈజీగా దొరకదు. అందుకే పర్యాటకులు ఇక్కడికి రాలేకపోతున్నారు. ఈ దేశం చాలా కాలం పాటూ.. ప్రపంచానికి దూరంగా ఉండిపోయింది. పాలకుల రకరకాల కండీషన్స్ వల్ల.. ఇది మోడ్రన్ ప్రపంచంలా మారలేదు. అందుకే నేటికీ ఈ దేశానికి చాలా తక్కువ మంది వస్తారు. ఈ దేశానికి వెళ్లిన ఒక పర్యాటకుడు counting.countries అనే ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో ఈ దేశం గురించి ఒక వీడియోని షేర్ చేశాడు.

# విశాఖ కేంద్రంగా సౌత్ కోస్టు రైల్వే జోన్..

## గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన కేంద్ర కేబినెట్




సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఢిల్లీలో శుక్రవారం సాయంత్రం సమావేశమైన కేంద్ర మంత్రి మండలి పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. ఈ క్రమంలోనే విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కాగా, వాల్తేరు రైల్వే డివిజన్‌ను సౌత్ విశాఖ డివిజన్‌గా మార్పు చేయాలని ఇప్పటికే నిర్ణయించిన సంగతి తెలిసిందే. నిజానికి సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌ను ఏర్పాటు చేస్తామని ఐదేళ్ల క్రితమే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఐదేళ్లుగా దీనిపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీనిపై తాజాగా ఒత్తిడి తీసుకోవడంతో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలోనే కేంద్ర కేబినెట్ దీనికి శుక్రవారం నాడు ఆమోదం తెలిపింది. అయితే వాల్తేరు డివిజన్‌ను రద్దు చేసి, దాని స్థానంలో విశాఖ డివిజన్‌ను తీసుకొచ్చింది. ఇప్పటివ రకు కొత్త జోన్‌లో విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు మాత్రమే ఉండేలా డీపీఆర్ సిద్ధమవుతోంది. అయితే రెండు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ జోన్‌లో విశాఖ డివిజన్ కూడా చేరనుంది. ఈ మేరకు ముసాయిదా డీపీఆర్ సిద్ధం చేయాలని జోన్ ప్రత్యేక అధికారికి ఇప్పటికే ఆదేశాలు అందాయి.

# ఈనెల 12-13 మధ్య అమెరికాలో ప్రధాని నరేంద్రమోదీ పర్యటన..!




ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 12, 13 తేదీల్లో అమెరికాలో పర్యటించనున్నారు. ఈ సంగతి విదేశాంగశాఖ కార్యదర్శి విక్రం మిస్రీ శుక్రవారం వెల్లడించారు. గత నెల 20న అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రధాని నరేంద్రమోదీ అమెరికాలో పర్యటించనుండటం ఇదే మొదటి సారి. అమెరికాలో నివసిస్తున్న అక్రమ భారత వలసదారులను యూఎస్ మిలిటరీ విమానంలో పంపేస్తామని ప్రకటించిన కొన్ని రోజుల్లో ప్రధాని నరేంద్రమోదీ పర్యటిస్తుండటం గమనార్హం. ఈ నెల 1012 తేదీల మధ్య ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో జరిగే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ సమ్మిట్‌కు మోదీ కో చైర్‌గా వ్యవహరించనున్నారు. జనవరి 27న ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఇమ్మిగ్రేషన్, ద్వైపాక్షిక సంబంధాలపై ఫోన్ చర్చలు జరిగాయి.

# హాట్ టాపిక్‌గా నాని రెమ్యునరేషన్

## ఇండస్ట్రీలో ఈయన రేంజ్ ఏంటో తెలుసా..?

వరుస సినిమాలు, విజయాలతో న్యాచురల్ స్టార్ నాని జోరు కొనసాగిస్తూనే ఉన్నారు. రెండేళ్ళ కింద దసరా, హాయ్ నాన్నతో విజయాలు అందుకున్న నాని.. గతేడాది సరిపోదా శనివారంతో మరో రూ.100 కోట్ల హిట్ సినిమా ఇచ్చాడు. విజయాలే కాదు.. నాని రెమ్యునరేషన్ కూడా ఇప్పుడు ట్రెండింగే. నాని మళ్ళీ రేట్ పెంచాడని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. గతంలో రూ.20 కోట్ల వరకు తీసుకునే నాని.. ఈ రోజుల్లో స్టార్ హీరోలకు ఇస్తున్న రెమ్యునరేషన్ గురించే ఇండియా అంతా మాట్లాడుకుంటోంది. మరీ ముఖ్యంగా మన టాలీవుడ్ టాప్ హీరోలైతే రూ.100 కాదు రూ.200 కోట్లు కావాలంటున్నారు. మన సినిమాలకు వస్తున్న కలెక్షన్లు కూడా ఆ రేంజ్‌లో ఉన్నాయి. అయితే మీడియం రేంజ్ హీరోలు ఇంకా రూ.10 నుంచి రూ.15 కోట్ల మధ్యలోనే ఉన్నారు. అలాంటిది రూ.50 కోట్ల రెమ్యునరేషన్ అనేది.. మిడ్ రేంజ్ హీరోలకు ఓ కల..! ఎందుకంటే వాళ్ల సినిమాలు హిట్టైనా అన్ని కోట్లు వస్తాయా అనేది అనుమానమే. పైగా టాలీవుడ్‌లో ఎప్పుడూ ఓ అనుమానం అలాగే ఉంటుంది. మీడియం రేంజ్ హీరోలలో నెంబర్ వన్ ఎవరా అని..? దీనికి సమాధానంగా ఎప్పుడూ నానినే ముందు కనిపిస్తుంటాడు. వరుస సినిమాలు, విజయాలతో జోరు చూపిస్తూనే ఉంటారు న్యాచురల్ స్టార్ నాని. రెండేళ్ళ కింద దసరా, హాయ్ నాన్నతో విజయాలు అందుకున్న నాని.. గతేడాది సరిపోదా శనివారంతో మరో రూ.100 కోట్ల సినిమా ఇచ్చాడు. విజయాలే కాదు.. నాని రెమ్యునరేషన్ కూడా ట్రెండింగే. నాని మళ్ళీ రేట్ పెంచాడంట.. ఈ లైన్ ఇండస్ట్రీలో బాగా ఫేమస్. ఇప్పుడూ ఇదే వినిపిస్తుంది. గతేడాది వరకు రూ.25 కోట్లు తీసుకున్న నాని.. ఇప్పుడు మరో రూ.5 కోట్లు పెంచేసారని ప్రచారం జరుగుతుంది. అంటే రూ.25 కోట్ల వరకు అడుగుతున్నట్లు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. అంతేకాదు.. DVV ఎంటర్‌టైన్మెంట్స్ ప్రొడక్షన్ హౌజ్ నానికి రూ.50 కోట్ల ప్యాకేజ్ ఇచ్చారని తెలుస్తుంది. సరిపోదా శనివారం చేస్తున్నపుడే డివివి దానయ్య నిర్మాణంలోనే సుజీత్ సినిమా సైన్ చేసాడు నాని. ఇది కాస్త లేట్ అవుతుందేమో కానీ కచ్చితంగా ఉంటుందని చెప్పాడు న్యాచురల్ స్టార్. ఈ 2 సినిమాలకు కలిపి నాని రూ.50 కోట్లు తీసుకుంటున్నారని చాలా రోజుల కిందే ప్రచారం జరిగింది.. ఇప్పుడిది నిజమే అంటున్నారు. మరోవైపు దసరా డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెలతో ప్యారడైజ్ కోసం భారీగానే తీసుకుంటున్నాడు నాని.





## వరుస ఫ్లాప్స్.. ఒకొక్క సినిమాకు రూ.4కోట్లు డిమాండ్..

# అమ్మడి ఆస్తిపాస్తులు తెలిస్తే నోరెళ్లబెట్టాల్సిందే

సినిమా ఇండస్ట్రీలో ఈ అమ్మడు ఓ స్టార్ హీరోయిన్.. అవకాశాలు వరుసగా వస్తున్నా కూడా అదృష్టం మాత్రం లేక సతమతం అవుతుంది ఈ చిన్నది. ఒకానొక సమయంలో వరుస హిట్స్‌తో రాణించింది.. కానీ ఇప్పుడు హిట్స్ లేక కష్టపడుతుంది. అయినా కూడా ఈ ముద్దుగుమ్మకు క్రేజ్ ఎక్కడ తగ్గలేదు. ఒకొక్క సినిమాకు ఏకంగా నాలుగు కోట్ల రెమ్యునరేషన్ అందుకుంటుంది. అంతే కాదు ఈ అమ్మడి నెట్ వర్త్ కూడా భారీగానే ఉంది.. ఆమె ఆస్తిపాస్తులు కూడా కోట్లల్లో ఉన్నాయి. తెలుగులోనే కాదు తమిళ్ హిందీ భాషల్లోనూ సినిమాలు చేస్తూ రాణిస్తుంది. ఇంతకూ ఆ చిన్నది ఎవరో తెలుసా .? ఆమె నటించిన లేటెస్ట్ మూవీలో రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయినటించింది. కానీ ఆ సినిమా కూడా నిరాశపరిచింది. ఇంతకూ ఆ బ్యూటీ ఎవరో తెలుసా.? పై ఫొటోలో కనిపిస్తున్న చిన్నదానికి తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో అభిమానులు ఉన్నారు. ఆ ముద్దుగుమ్మ ఎవరంటే.. టాలీవుడ్ బుట్టబొమ్మ పూజా హెగ్డే. ఈ అమ్మడు తెలుగులో వరుసగా సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తెలుగులో దాదాపు అందరూ హీరోలు సరసన నటించి మెప్పించింది. ఈ మధ్య పూజా హెగ్డే నటించిన సినిమాలు ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోలేకపోతున్నాయి. ఈ బ్యూటీ చేసిన సినిమాలు వరుసగా ఫ్లాప్ అవుతూ వచ్చాయి. పూజా హెగ్డే నటించిన సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి. తెలుగు రాధేశ్యామ్, తమిళ్ లో బీస్ట్, హిందీలో సల్మాన్ ఖాన్ తో చేసిన ఇలా వరుసగా ఫ్లాప్ అయ్యాయి. ఆతర్వాత మహేష్ బాబు తో గుంటూరు కారం సినిమాలో ఛాన్స్ వచ్చినా ఆ మూవీ నుంచి తప్పుకుంది. అలాగే పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా నుంచి కూడా తప్పుకుంది. ఇక కొంతకాలం గ్యాప్ ఇచ్చిన తర్వాత రీసెంట్ గా బాలీవుడ్ లో దేవ్ అనే సినిమా చేసింది. ఈ సినిమాలో రొమాంటిక్ సీన్స్ లో రెచ్చిపోయి నటించింది. కానీ ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. ఇప్పుడు దళపతి విజయ్ నటిస్తున్న సినిమాలో ఛాన్స్ అందుకుంది. అలాగే సూర్య హీరోగా నటిస్తున్న రెట్రో సినిమాలో నటిస్తుంది. ఈ బ్యూటీ ఒకొక్క సినిమా రూ. 4కోట్లు అందుకుంటుంది. అలాగే ఈ అమ్మడి నెట్ వర్త్ రూ. 50కోట్లు ఉంటుందని తెలుస్తుంది.

# జాక్ కొంచెం క్రాక్

## ఆసక్తికరంగా సిద్దు జొన్నలగడ్డ నయా మూవీ టీజర్



స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ పుట్టిన రోజు (ఫిబ్రవరి 7) సందర్భంగా 'జాక్ - కొంచెం క్రాక్' నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చింది. సిద్ధు బర్త్ డే స్పెషల్‌గా మేకర్లు జాక్ టీజర్‌ను విడుదల చేశారు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. సిద్ధ, భాస్కర్ కాంబోలో అదిరిపోయే ఓ వినోదాత్మక చిత్రం రాబోతోందనీ టీజర్ స్పష్టంగా చెబుతోంది. టీజర్‌లో సీనియర్ నటుడు నరేష్, సిద్ధు మధ్య వచ్చే తండ్రీ కొడుకులకు సంబంధించిన సన్నివేశాలు ప్రేక్షకులకు నవ్వులు పంచుతాయని అర్థం అవుతుంది. ఇక హీరోల పాత్రలోని డిఫరెంట్ షేడ్స్ ఈ టీజర్‌లో చూపించాడు. అసలు హీరో ఏంటి? ఏ ఉద్యోగం చేస్తున్నాడు? అతని లక్ష్యం ఏంటి? అతని గమ్యం ఏంటి? ఆ పోరాటాలు ఏంటి? ఈ ప్రేమ కథ ఏంటి? అని ఇలా రకరకాల ప్రశ్నలు తలెత్తేలా, సినిమా మీద ఆసక్తి పెంచేలా టీజర్‌ను కట్ చేశారు. సిద్ధు నుంచి మరొక బ్లాక్ బస్టర్ రాబోతోందని ఈ టీజర్ చెప్పకనే చెబుతోంది. సిద్ధు స్టైలిష్ లుక్స్, యాక్టింగ్‌కు మరోసారి ఆడియెన్స్ మెస్మరైజ్ కానున్నారు. వైష్ణవి చైతన్య, సిద్ధు జంట చాలా రిఫ్రెషింగ్‌గా అనిపిస్తోంది. బొమ్మరిల్లు భాస్కర్ ఈ సారి తన శైలిని పూర్తిగా పక్కన పెట్టి ఏదో సందేశాన్ని ఇస్తూనే కావాల్సినంత ఎంటర్‌టైన్‌మెంట్‌ను జోడించారని అర్థం అవుతోంది. ప్రముఖ నిర్మాత బివిఎస్ఎన్ ప్రసాద్ నేతృత్వంలోని అగ్ర నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. ఈ చిత్రంలో ప్రకాష్ రాజ్, బ్రహ్మాజీ వంటి వారు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం అచ్చు రాజమణి స్వరాలు సమకుర్చారు.

# క్రీడా వార్తలు
# SPORTS NEWS



# ఛాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఎక్స్‌ఫాక్టర్ అతనే: ఆసీస్ దిగ్గజం

రికీ పాంటింగ్ శ్రేయాస్ అయ్యర్‌ను టీం ఇండియాకు అత్యంత ముఖ్యమైన బ్యాట్స్‌మన్‌గా అభివర్ణించాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అతని అద్భుతమైన ఇన్నింగ్స్‌ను పాంటింగ్ ప్రశంసించాడు. స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో అతని నైపుణ్యం, వైట్ బాల్ క్రికెట్‌లో విజయానికి తోడ్పడే అతని ఆటశైలిని పాంటింగ్ హైలైట్ చేశాడు. గాయాల తర్వాత తిరిగి రావడం పట్ల పాంటింగ్ సంతోషం వ్యక్తం చేశాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత క్రికెట్ జట్టు తరపున చాలా మంది స్టార్ బ్యాట్స్‌మెన్స్ ఆడుతున్నారు. ఇందులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శుభ్‌మాన్ గిల్‌తో పాటు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, రిషబ్ పంత్ ఉన్నారు. కానీ ఆస్ట్రేలియా మాజీ గొప్ప కెప్టెన్ రికీ పాంటింగ్ శ్రేయాస్ అయ్యర్‌ను టీం ఇండియాకు అత్యంత కీలక బ్యాట్స్‌మన్‌గా అభివర్ణించాడు. శ్రేయాస్ అయ్యర్ చాలా కాలం తర్వాత మళ్ళీ టీం ఇండియా తరపున వన్డే ఫార్మాట్‌లో కనిపించిన సంగతి తెలిసిందే. నాగ్‌పూర్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి వన్డే మ్యాచ్‌లో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ మ్యాచ్‌లో 36 బంతుల్లో 59 పరుగులు చేసిన శ్రేయాస్‌ను టీమ్ ఇండియా టాప్6 బ్యాట్స్‌మెన్‌లో చేర్చకపోవడం పట్ల పాంటింగ్ ఆశ్చర్యపోయాడు. ఈ ఆటగాడిని ఛాంపియన్స్ ట్రోఫీకి ఎక్స్‌ఫ్యాక్టర్ బ్యాట్స్‌మన్ అంటూ చెప్పుకొచ్చాడు.

### శ్రేయాస్ అయ్యర్‌కు అభిమానిగా మారిన రికీ పాంటింగ్..

ఈ ఐసీసీ రివ్యూ ఎపిసోడ్‌లో, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ హోస్ట్ సంజన గణేషన్‌తో మాట్లాడారు. ఈ సమయంలో, అతను శ్రేయాస్ అయ్యర్‌పై ప్రశంసలు కురిపించాడు. ఆయన మాట్లాడుతూ.. "అతను (శ్రేయస్ అయ్యర్) వైట్ బాల్ ఫార్మాట్‌లో సత్తా చాటుతున్నాడు. స్లో వికెట్లపై అతను అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్నాడు. అలాగే, స్పిన్‌ను ఎదుర్కోవడంలో అతను అత్యుత్తమ బ్యాట్స్‌మన్" అంటూ పొగడ్తలు కురిపించాడు. "స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో అతను ఎంత మంచి హిట్టర్ అని మాకు తెలుసు. భారతదేశంలో జట్లు పెద్దగా స్పిన్ బౌలింగ్ చేయవు. కానీ, ఏదో ఒక దశలో అది జరుగుతుంది. అతను తిరిగి తమ జట్టులోకి రావడం నాకు సంతోషంగా ఉంది" అంటూ కితాబిచ్చాడు. "గత రెండు సంవత్సరాలుగా అతను భారత జట్టుకు దూరంగా ఉండటం నాకు కొంచెం ఆశ్చర్యంగా ఉంది. అతను భారతదేశంలో అద్భుతమైన ప్రపంచ కప్‌ను కలిగి ఉన్నాడు. మిడిల్ ఆర్డర్‌లో నిజంగా బాగా రాణిస్తున్నాడు. అతను ఆ స్థానాన్ని దాదాపుగా ఖరారు చేసుకున్నాడని, దానిని తన సొంతం చేసుకున్నాడని నేను అప్పుడు అనుకున్నాను. అయితే, కొన్ని గాయాలు అయ్యాయి. స్పష్టంగా అతను తన వీపుకు గాయమై జట్టుకు దూరంగా ఉన్నాడు. కానీ, ఈ సంవత్సరం అతను దేశీయ క్రికెట్‌లో అద్భుతంగా ఉన్నాడు. (ఐపిఎల్) వేలం నుంచి అతను దేశీయ క్రికెట్‌లోనూ సత్తా చాటిన సంగతి తెలిసిందే" అంటూ చెప్పుకొచ్చాడు.

# ఆడాల్సింది జట్టు కోసం.. నీ కోసం కాదు...

## భారత స్టార్ బ్యాటర్‌పై గవాస్కర్ ఫైర్



ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి వన్డేలో భారత వికెట్ కీపర్-బ్యాట్స్ మాన్ కేఎల్ రాహుల్ విఫలమయ్యాడు. 9 బంతుల్లో అతని బ్యాట్ నుంచి కేవలం 2 పరుగులు మాత్రమే వచ్చాయి. అతని ఇన్నింగ్స్ తర్వాత, మాజీ కెప్టెన్, వ్యాఖ్యాత సునీల్ గవాస్కర్ ఈ సీనియర్ ప్లేయర్‌పై విమర్శలు గుప్పించారు. కేఎల్ రాహుల్ మరోసారి వార్తల్లో నిలిచాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి వన్డేలో అతను కేవలం 2 పరుగులు మాత్రమే చేశాడు. అప్పటి నుంచి ఈ ఆటగాడిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ కూడా రాహుల్ పై ఇలాంటి ప్రశ్ననే లేవనెత్తారు. క్రికెట్ అనేది జట్టు ఆట అని, ఇక్కడ మీరు మీ కోసం ఆడాల్సిన అవసరం లేదంటూ గవాస్కర్ కేఎల్ రాహుల్‌కు సలహా ఇచ్చాడు. గవాస్కర్ ప్రకటనను బట్టి చూస్తే, కేఎల్ రాహుల్ జట్టు కోసం కాకుండా తన కోసమే బ్యాటింగ్ చేస్తున్నట్లు అనిపిస్తుంది. గవాస్కర్ ఏమన్నారో ఓసారి చూద్దాం..

### రాహుల్‌పై ప్రశ్నల వర్షం సంధించిన గవాస్కర్..

రాహుల్ వచ్చిన వెంటనే డిఫెన్సివ్ క్రికెట్ ఆడటం ప్రారంభించాడని గవాస్కర్ కామెంట్రీ సందర్భంగా చెప్పుకొచ్చాడు. 'నువ్వు మరీ రక్షణాత్మకంగా ఉండాల్సిన అవసరం లేదు.' ఇది జట్టు ఆట. నువ్వు అనవసరంగా షాట్ ఆడి అవుట్ అయ్యావు' అంటూ చెప్పుకొచ్చాడు. క్రీజులోకి వచ్చిన తర్వాత రాహుల్ చాలా సమయం తీసుకుంటున్నట్లు కనిపించింది. కానీ, 9వ బంతికి ఆదిల్ రషీద్ బౌలింగ్‌లో అతను ఔటయ్యాడు. రాహుల్ గిల్ తన సెంచరీ పూర్తి చేయాలని కోరుకున్నట్లు అనిపించింది. కానీ, ముందే రాహుల్ ఔటయ్యాడు. తరువాత గిల్ కూడా సెంచరీ సాధించలేకపోయాడు. 87 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అతని వికెట్ కోల్పోయింది.

### కేఎల్ రాహుల్ స్థానంపైనా ప్రశ్నలు

నాగ్‌పూర్ వన్డేలో కేఎల్ రాహుల్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో స్థానం ఇవ్వడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. టీం ఇండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ, జట్టులో ప్రధాన వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్. కానీ, కెప్టెన్ రోహిత్, కోచ్ గంభీర్ రాహుల్‌ను వికెట్ కీపర్‌గా ఆడించారంటూ విమర్శలు గుప్పించారు. రాహుల్‌ను ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు పంపారు. అతను విఫలమయ్యాడు. రాహుల్ వైఫల్యం టీం ఇండియాపై పెద్దగా ప్రభావం చూపలేదు. భారత జట్టు ఇంగ్లాండ్‌ను 4 వికెట్ల తేడాతో ఓడించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో ఉంది. తదుపరి మ్యాచ్ ఆదివారం జరుగుతుంది.

# బలంగా ఢీ కొన్న బౌలర్, నాన్ స్ట్రైకర్..



క్రికెట్ మైదానంలో హై వోల్టేజ్ డ్రామాలకు కొదువే లేదు. శ్రీలంక, ఆస్ట్రేలియా మధ్య రెండో టెస్ట్ మ్యాచ్ గాలె ఇంటర్నేషనల్ స్టేడియంలో జరుగుతోంది. ఈ టెస్ట్ మ్యాచ్ సమయంలో, అందరినీ ఆశ్చర్యపరిచే ఒక విషయం జరిగింది. బౌలింగ్ చేసిన తర్వాత, ఒక బౌలర్ అకస్మాత్తుగా నాన్‌స్ట్రైకర్ ఎండ్‌లో నిలబడి ఉన్న బ్యాట్స్‌మన్‌ని బలంగా తాకాడు. బలంగా ఢీ కొట్టడంతో బ్యాట్స్‌మన్ నేలపై పడిపోయాడు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**క్రికెట్ మైదానంలో నాటకీయ పరిణామం..**

ఈ సంఘటన శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 61వ ఓవర్‌లో జరిగింది. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో, ఆస్ట్రేలియా ఎడమ చేతి వాటం స్పిన్నర్ మాథ్యూ కుహ్నెమాన్ 61వ ఓవర్‌లో బౌలింగ్ చేయడానికి వచ్చాడు. ఆ సమయంలో శ్రీలంక బ్యాట్స్‌మన్ కుశాల్ మెండిస్ స్ట్రైక్‌పై ఉన్నాడు. 61వ ఓవర్లో, మాథ్యూ కుహ్నెమాన్ వేసిన మొదటి బంతికే కుశాల్ మెండిస్ సింగిల్ తీసి నాన్‌స్ట్రైకర్ ఎండ్‌లో నిలిచాడు. ఆ తర్వాత మాథ్యూ కుహ్నెమాన్ దినేష్ చండిమాల్‌ను 74 పరుగులకు అవుట్ చేశాడు. దినేష్ చండిమాల్ ఔట్ అయిన తర్వాత, కొత్త బ్యాట్స్‌మన్ రమేష్ మెండిస్ స్ట్రైక్‌లోకి వచ్చాడు. 61వ ఓవర్లో, మాథ్యూ కుహ్నెమాన్ వేసిన మూడవ బంతికి, రమేష్ మెండిస్ డిఫెన్సివ్ షాట్ ఆడటం ద్వారా రన్ తీసేందుకు ప్రయత్నించాడు. కానీ, అకస్మాత్తుగా ఊహించని సంఘటన చోటు చేసుకుంది. రమేష్ మెండిస్ ఆన్ సైడ్ వైపు షాట్ ఆడాడు. మాథ్యూ కుహ్నెమాన్ వెంటనే బంతి వైపు వేగంగా పరిగెత్తాడు. ఈ సమయంలో, అకస్మాత్తుగా, తెలియకుండానే, నాన్‌స్ట్రైకర్ ఎండ్‌లో నిలబడి ఉన్న మాథ్యూ కుహ్నెమాన్, కుశాల్ మెండిస్ బలంగా ఢీకొన్నారు. ఆ తర్వాత, కుశాల్ మెండిస్ కొంతసేపు నేలపై పడిపోయాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com